
ఆంధ్రజ్యోతి

**** ఇఫ్తార్ : 6.30 | సహర్ : 5.06 (సోమవారం)

ANDHRAJYOTHY



నల్లగొండ

5

ఆదివారం 9 మార్చి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	175	200
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 | కనిష్ఠం 21.6

కల్యాణం కమనీయం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో లక్ష్మీనారసింహుల బ్రహ్మోత్సవ తిరుకల్యాణం శనివారం వేద మంత్రోచ్చారణ.. భక్తుల గోవింద నామస్మరణల మధ్య శాస్త్రోక్తంగా జరిగింది. భక్తపరాయణుడు, అవతార పురుషుడు నారసింహుడితో.. సిరి సంపదలకు నెలవైన సముద్రరాజ తనయ లక్ష్మీదేవితో పాంచరాత్రాగమ రీతిలో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు.

• 7లో..

● ఆంధ్రజ్యోతి, యాదాద్రి



స్వామివారి కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

నామినేటెడ్‌పై చిగురిస్తున్న ఆశలు



రాష్ట్రంలో అతి త్వరలో నామినేటెడ్ పదవులన్నింటినీ భర్తీ చేస్తామని అధిష్ఠానం నుంచి సంకేతాలు రావడంతో ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్ నియమితులయ్యాక జరిగిన వరుస సమీక్షల నేపథ్యంలో ఈ మేరకు నేతలకు భరోసా లభించింది. క్యాబినెట్ విస్తరణ, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల నియామకాలు, పెండింగ్‌లో ఉన్న రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల పదవులు, జిల్లాల్లో ముఖ్యమైన నామినేటెడ్ పదవులన్నింటినీ ఈ నెలాఖరులోగా భర్తీ చేసేందుకు రంగం సిద్ధమైంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

- క్యాబినెట్ విస్తరణ, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల్లో ఛాన్స్!
- కీలక నేతలకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్లు పక్కా అనే సంకేతాలు
- పదవుల కోసం క్యూలో ఉన్న పలువురు కీలక నాయకులు
- సీఎం, మంత్రుల ఢిల్లీ టూర్ నేపథ్యంలో ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు
- గాడ్‌ఫాదర్లపై ఒత్తిడి పెంచిన ఆశావహులు

ఉమ్మడి జిల్లాలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సీనియర్ల వివరాలను అధిష్ఠానం తెప్పించుకుంటుండడంతో ఆశావహుల్లో ఒక్కసారిగా సందడి మొదలైంది. క్యాబినెట్ విస్తరణ, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారుతో పాటు ముఖ్యమైన నియామకాల కోసం ఏఐసీసీ ఆమోద ముద్ర తీసుకునేందుకే సీఎం సహా ముఖ్యనేతలు ఆదివారం ఢిల్లీకి వెళ్తారని తెలియడంతో ఆశావహులు చివరి ప్రయత్నాలను వేగవంతం చేశారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులతో పాటు జిల్లా స్థాయిల్లో ఉండే గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, మహిళా ఆర్గనైజర్ పదవులు, దేవాలయాల కమిటీల చైర్మన్ పదవులు, నుడా చైర్మన్ పదవి, మార్కెట్ కమిటీ చైర్మన్ల వంటి పదవులను ఆశించే నాయకులంతా వారికి పదవులు ఇప్పించాలని మంత్రులు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు.

ఉమ్మడి జిల్లాకు స్థానం దక్కుతుందనే ఆశాభావం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రివర్గంలో జిల్లా నుంచి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కీలకమైన మంత్రి పదవులు దక్కాయి. అయితే బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి క్యాబినెట్ విస్తరణలో అవకాశం కల్పిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చిందని, విస్తరణ చేపడితే ఆయనకు మంత్రి పదవి దక్కుతుందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చసాగుతోంది. మరోవైపున దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్‌కు సైతం విస్తరణలో మంత్రి పదవి లేదా, డిప్యూటీ స్పీకర్ పదవి వస్తుందనే ప్రచారం సాగుతోంది. తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2014, 2018 ఎన్నికల్లో పోటీచేసి ఓటమిపాలవడంతో పాటు, గత ఎన్నికల్లో పోటీ చాన్స్ కోల్పోయినా పార్టీలోనే కొనసాగుతున్న డాక్టర్ అద్దంకి దయాకర్ పేరు రాజ్యసభకు కూడా పరిశీలించినా సమీకరణాల్లో కుదరలేదని, ఎమ్మెల్సీగా ఆయనకు అవకాశం తథ్యమని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, డాక్టర్ కె.నగేశ్ కూడా పార్టీలో క్రియాశీలకంగా ఉండడంతో వీరికి ఎలాంటి పదవులిస్తారనే ఆసక్తి పార్టీలో నెలకొంది. నల్లగొండ డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న కేతావత్ శంకర్‌నాయక్‌కు కూడా ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని పార్టీ ముఖ్యనేతల నుంచి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన నేపథ్యంలో తనకు పదవి ఖాయమనే విశ్వాసంలో ఆయన ఉన్నారు. వీరితో పాటుగా బీసీ కోటాలో మునుగోడు నియోజకవర్గానికి చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్‌నేత కూడా తనకు పార్టీ పెద్దల ఆశీర్వాదం ఉందని, ఎమ్మెల్సీ లేక కార్పొరేషన్ చైర్మన్ పదవి ఖాయమనే...

- మిగతా 6వ పేజీలో...



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో మంత్రి వెంకట్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యేలు

వేసవిలో ఇబ్బందులు రాకుండా చూడాలి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేసవిలో తాగు, సాగునీరు, విద్యుత్‌కు ఇబ్బందులు రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పని చేయాలని వ్యవసాయశాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కలెక్టర్‌లో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా తాగునీరు, ఇరిగేషన్, విద్యుత్ అంశాలపై సమీక్షలో ఆయన మాట్లాడారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- వేసవిలో అప్రమత్తంగా ఉండాలి : మండలి చైర్మన్ గుత్తా
- ప్రజలకు పూర్తి సేవలు అందించాలి: మంత్రి కోమటిరెడ్డి
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు అంశాలపై సమీక్ష

వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా, అలాగే పంటలు ఎండిపోకుండా, విద్యుత్ సరఫరా నిరంతరం కొనసాగేలా సంబంధిత శాఖల సీనియర్ అధికారులు మొదలు కిందిస్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. మిషన్ భగీరథ అధికారులు ప్రజలకు తాగునీటి ఇబ్బంది ఏర్పడకుండా ఈఎన్‌సీ స్థాయిలో పూర్తి దృష్టి సారించాలన్నారు. తక్షణ తాగునీటి సమస్యలను తీర్చేందుకు అవసరమైతే కలెక్టర్ల వద్ద నిధులు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి వెసులుబాటు కల్పిస్తామన్నారు. అలాగే ముఖ్యమంత్రితో చర్చించి శాసనసభ్యులకు ఎస్‌డీఎఫ్ కింద నిధులు ఇచ్చేలా చర్చిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఒక్క ఎకరం పొలం కూడా ఎండిపోకుండా ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందించి పంటలు కాపాడాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు కాల్వలపై పర్యటించాలని, అలాగే వ్యవసాయ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తిరిగి ఎప్పటికప్పుడు నీటి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టుల కింద ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని సరైన విధంగా పర్యవేక్షణ చేసి అందరికీ వచ్చేలా చూడాలన్నారు. విద్యుత్ అధికారులు విద్యుత్ సమస్యలు రాకుండా క్షేత్రస్థాయిలో తిరిగి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మూడు సమస్యలపై దృష్టి పెట్టి పనిచేయాలని, అదేవిధంగా ప్రజాప్రతినిధులు సైతం మండల స్థాయి అధికారులను వెంట తీసుకెళ్లి గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేసవిలో ఈ మూడు అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు మనసు పెట్టి పనిచేసి సమన్వయంతో కృషి చేయాలన్నారు.

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో 1,775 గ్రామాలు ఉన్నాయని, ప్రతీ రోజు 140 ఎంఎల్‌డీ తాగునీరు అవసరం ఉందన్నారు. విలీన గ్రామాల్లో తప్ప ఎక్కడా సమస్య లేదని, తాగునీటి బోర్ల చిన్న చిన్న మరమ్మతులకు, అలాగే పైపులైన్ల మరమ్మతులకు...

- మిగతా 7వ పేజీలో...

ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



వేసవిలో కష్టమైనప్పటికీ అధికారులు ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కలెక్టర్లు తాగునీటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, అందుబాటులో ఉన్న నిధులను ప్రతి గ్రామానికి రూ.10వేల నుంచి రూ.15వేల చొప్పున తక్షణమే కేటాయించి ఎక్కడైనా తాగునీటి సమస్య ఉత్పన్నమవుతే వాటిని వినియోగించాలన్నారు. శాసనసభ్యులు సైతం వారి ఎస్‌డీఎఫ్ నిధులను తాగునీటి కోసం కేటాయించాలని కోరారు.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ, తక్షణం తాగునీటి అవసరాలకు కలెక్టర్ల వద్ద కనీసం రూ.5కోట్లు, నల్లగొండ జిల్లా విస్తీర్ణం పెద్దగా ఉన్నందున రూ.15కోట్ల నిధులు ఉంచాలని, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎక్కడ తాగునీటి సమస్య ఉంటే అధికారులు అక్కడికి వెళ్లి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సాగునీటికి సంబంధించి మేజర్ ప్రాజెక్టులు, కాల్వలపై కచ్చితంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఏఎంఆర్ ప్రాజెక్టు కింద కెనాల్ విస్తరణ, లైనింగ్ చేపడితే సమృద్ధిగా నీరు అందించవచ్చని, ఉదయ సముద్రం మేజర్ కెనాల్ పూర్తి చేసి చెరువులకు నీరు అందిస్తే సాగునీటి సమస్య రాదన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కాల్వలపై వందలాది మోటర్లు ఏర్పాటు చేసుకున్నారని, అలాగే అవసరం లేకున్నా నిరంతరం పవర్ బోర్లు నడుస్తున్నాయని, దీంతో విద్యుత్‌తో పాటు నీరు వృథా అవుతోందని, దీన్ని నియంత్రించే విషయాన్ని అధికారులు ఆలోచించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద కాల్వల చిన్న చిన్న పనులు చేపట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విద్యుత్ సమస్య లేదని, అయినా ఆ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

చారిత్రాత్మక సంపదకు నెలవు నందికొండ



నాగార్జునకొండపై ఉన్న మ్యూజియం

• 6లో..

ఇద్దరు సీఐలు, ఎస్ఐపై బదిలీవేటు!

● మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐగా మోతీరాం

• 6లో..

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మహిళలతో సెల్ఫీ దిగుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో జిల్లా, పట్టణ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 150 సీట్లలో 50మంది మహిళలు ఎమ్మెల్యేగా ఉంటారన్నారు. మహిళా బిల్లు కూడా త్వరలో అమలవుతుందని పేర్కొన్నారు. త్వరలో కొత్తగా 1,000 ఆర్టీసీ బస్సులను మహిళా సంఘాలకు అప్పగిస్తామన్నారు. జిల్లాలోని మహిళా సంఘాలకు 50 బస్సులను కేటాయిస్తామన్నారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగాని మాధవి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500కు సిలిండర్ అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డుపల్లి లక్ష్మి, గాజుల సుకన్య, దుబ్బ రూప, భాగ్య, నాగమణిరెడ్డి, లలిత, సదాలక్ష్మి, ధనలక్ష్మి, మాధవి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటిని మంత్రులు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిని సన్మానించారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

కామినేని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బాబాసాహెబ్



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

రామగిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కామినేని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బాబాసాహెబ్, గైనకాలజీ విభాగం హెచ్‌వోడీ సునిత సుధీర్ అన్నారు. స్థానిక సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో కామినేని సొసైటీ డైరెక్టర్ డాక్టర్ లూథర్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ఆరోగ్య సదస్సులో మాట్లాడారు. మహిళలు గర్భాశయ క్యాన్సర్‌కు గురికాకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. తొమ్మిదేళ్ల వయసు నుంచి మూడు దోసులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ కల్నల్, పీవీ.రామ్మోహన్, ఉమెన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పవిత్ర, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, వైద్యులు సునిత, రామారావు, రీటా, మారుతిశర్మ, బాలరాజు, శంకర్, వై.అశోక్‌దేవ్, మౌనిక, దేవకుమారి, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

జిల్లా న్యాయాధికారి ఎం.నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి నాగరాజు

నల్లగొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.నాగరాజు అన్నారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాలతో జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం లోక్‌అదాలత్ నిర్వహించారు.

ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో 40సివిల్ కేసులు, 5,807 క్రిమినల్ కేసులు, 95 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 3 బ్యాంక్, 29సైబర్‌క్రైం, 100 ట్రాన్స్‌కో కేసులతో పాటు 12,879 ట్రాఫిక్ చలా నా కేసులు, మొత్తంగా 18,953 పెండింగ్ కేసులను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం మహిళలు గళమెత్తాలి

నకిరేకల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం మహిళలు గళమెత్తాలని నకిరేకల్ సీనియర్ సివిల్ జడ్జి మంజుల సురియార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం సామానత్వంతో కూడిన మహిళా సాధికారత అనే అంశంపై నిర్వహించిన చైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. దేశంలో స్త్రీలకు సమాన అవకాశాలు లభించడంలేదన్నారు. అందుకు మహిళలు గళమెత్తాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ఐ జిల్లా కన్వీనర్ గోనె శ్రీలత, సైదమ్మ, యశోద, జ్యోతి, దేవయాని, యాట మధుసూదన్‌రెడ్డి, పి.నర్సింహమూర్తి, కె.శ్రీనివాస్, ఆర్.రాకేష్‌కుమార్, కె.రవికుమార్, జయసాగర్, తదితరులు పాల్గొన్నారు.

చారిత్రాత్మక సంపదకు నెలవు నందికొండ




నందికొండ ఏరియల్ వ్యూ

- బౌద్ధం పరిఢవిల్లిన నేల
- పర్యాటకులను ఆకట్టుకుంటున్న మ్యూజియం
- 1966లో ప్రారంభం
- ఎన్నో బౌద్ధమత చారిత్రాత్మక సంపద భద్రం

ప్రకృతి ఒడిలో ఒదిగిపోయిన ప్రాంతం నందికొండ. చుట్టూ కృష్ణానదీ పరవళ్లు, ఎత్తయిన కొండల మధ్య విస్తరించిన ఈ నేల చారిత్రాత్మక సంపదకు నెలవు. ఆచార్య నాగార్జునుడు, ఇక్ష్వాకులు, శాతవాహనులు నడయాడిన నేల. ప్రకృతి రమణీయతను సంతరించుకున్న ప్రాంతం, ఎన్నో విశేషాలకు కేంద్రంగా ఉంది. ఇక్కడే బౌద్ధం పరిఢవిల్లింది. నాటి చరిత్రకు సాక్ష్యాలుగా అక్కడి శిల్ప సంపద నేటికీ దర్శనమిస్తాయి. పురావస్తు శాఖ తవ్వకాల్లో బయటపడిన ప్రాచీన సంపదను కొండపై మ్యూజియంతో కొలువై ఉన్నాయి. అనేక చారిత్రాత్మక సంపదతో పాటు కళాఖండాలు ఇందులో దర్శనమిస్తాయి. రాతి యుగం నుంచి నవీన శిలా యుగం వరకు మానవులు వినియోగించిన వస్తువులను ఇక్కడి మ్యూజియంలో భద్రపరిచారు. ఈ ప్రాంతాన్ని, చారిత్రాత్మక సంపదను చుసేందుకు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు.

- (ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)

నాగార్జునసాగర్ జలాశయంలో నల్లమల కొండల నడుమ 144 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ప్రాంతమే నాగార్జునకొండ(నందికొండ). ఈ కొండపై 1966లో మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 1923 నుంచి 1960 వరకు సాగిన తవ్వకాల్లో లభించిన క్రీస్తు శకం 3, 4 శతాబ్దాలకు చెందిన ఇక్ష్వాకుల, శాతవాహనుల కాలం నాటి శిల్పాలు. శిలాఫలకాలు, చారిత్రాత్మక వస్తువులను భద్రపరిచారు. క్రీస్తు పూర్వం 2వ శతాబ్దం నుంచి 3వ శతాబ్దం వరకు నాగార్జునకొండ దక్షిణ భారతదేశంలో ప్రముఖ బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లింది. ఇది ప్రముఖ బౌద్ధ తాత్వికుడు, దార్శనికుడు ఆచార్య నాగార్జునుడి పేరిట ప్రసిద్ధి చెందింది. మహాయానా బౌద్ధ మతధర్మ వ్యాప్తికి ఇక్కడి విజ్ఞాన కేంద్రం ఎంతగానో ఉపయోగపడింది. చైనా, శ్రీలంక దేశాలకు చెందిన విద్యార్థులు ఇక్కడకు వచ్చి ధార్మిక విద్యాభ్యాసం చేశారని చరిత్ర చెబుతోంది. నాగార్జున విశ్వవిద్యాలయం, దైత్య గృహాలు, స్తూపాలు, మంటపాలు, విహారాలు, పాలరాతి కట్టడాలు బౌద్ధశిల్పాలు తవ్వకాల్లో బయటపడ్డాయి. వీటిలో స్తూపాన్ని పోలిన తొమ్మిది నిర్మాణాలు ప్రాముఖ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇది చక్రాకారంలో నిర్మితం కావడం విశేషం. ఇందులో మహదైత్య అత్యంత ప్రమాణమైంది.



మ్యూజియం విశేషాలు

నాగార్జునసాగర్ నిర్మాణ సమయంలో 1959లో అప్పటి విద్యాశాఖ మంత్రి హ్యుమయున్ కబీర్ మ్యూజియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 1966లో అప్పటి కేంద్రమంత్రి సాంస్కృతిక శాఖ మంత్రి ఎం చాగ్లా మ్యూజియాన్ని ప్రారంభించారు. మ్యూజియాన్ని యూ ఆకారంలో నిర్మించారు.

స్తూపం నమూనా

1700లో స్తూపం ఎలా ఉండేదో తెలిపే నమూనాలు ఇక్కడ ఉన్నాయి. మ్యూజియంలో ఉండే అన్ని శిలాఫలకాలను కలిపితే ఈ స్తూపం నమూనా వస్తుంది.

స్తూప ముఖభాగం

తవ్వకాల్లో బయటపడ్డ స్తూపఫలక భాగం నాలుగువైపులా ఒకే విధంగా ఉంటుంది. స్తూప మధ్య భాగంలోని నిలువు ఐదు గీతలు బుద్ధుడి జీవితంలో ఐదు దశలను తెలియజేస్తాయి. ఒకటి బుద్ధుడి జననం, రెండు మహానిష్క్రమణ, మూడు తపస్సు, నాలుగు మొదటి ఉపన్యాసం, ఐదు నిర్యాణం.


నందికొండకు తీసుకెళ్లే లాంచీ

మహదానందం లాంచీ ప్రయాణం

నాగార్జునకొండకు వెళ్లాలంటే సాగర్ హిల్‌కాలనీ నుంచి 18 కిలోమీటర్లు కృష్ణ నదిలో లాంచీలో ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం హిల్‌కాలనీ నుంచి కొండకు తీసుకెళ్లేందుకు పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150 వసులు చేస్తున్నారు.

మహాస్తూపం

నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల్లోని తవ్వకాలలో బయటపడిన స్తూపాలలో అతి పెద్దది మహాస్తూపం. ఈ స్తూపంలోనే బుద్ధుడి అస్తికలు దొరికాయి. మట్టికుండ దానిలో రాగి కుండ దీనిలో వెండి కుండ దానిలో బంగారు కుండ దీనిలో బంగారు వెండి పుష్పాలతో పాటు గౌతమ బుద్ధుడి అస్తికలకు సంబంధించిన ధాతువు లభించింది.

స్తూపంపై బ్రహ్మలిపి

గౌతమ బుద్ధుడి అస్తికలు స్తూపం మధ్యభాగంలో ఉన్నాయని తెలిపే శిలాశాసనం ఇది. ఈ స్తూపంపై విశేషాలు బ్రహ్మలిపిలో లిఖించారు. క్రీస్తు పూర్వం 6వ శతాబ్దంలో బుద్ధుడి అస్తికలు పంచుకున్నారు. క్రీస్తు పూర్వం 3వ శతాబ్దంలో కలింగ యుద్ధం తరువాత అశోకుడు బౌద్ధ మతానికి ఆకర్షితుడై బౌద్ధ మతాన్ని స్వీకరించారు. అప్పుడే 84 వేల బౌద్ధ స్తూపాలను నిర్మించడమే కాకుండా తన కుమారుడు మహేంద్రుడు, కుమార్తె సంఘమిత్రలకు బుద్ధుని అస్తికలు ఇచ్చి బౌద్ధ మత వ్యాప్తికి పంపించాడు.

మూడు మూర్తుల విగ్రహం

క్రీస్తు శకం 1600లో పాలించిన విజయనగర రాజుల కాలం నాటి ఈ విగ్రహం మెటల్‌తో తయారుచేశారు. కొడితే శబ్దం వస్తుంది. ఈ విగ్రహంలో ముగ్గురు స్వాములు కనువిందుచేస్తారు. పైభాగంలో శంకు, కిరీటం, చక్రాలతో కూడిన వేంకటేశ్వరస్వామి రూపం, మధ్యలో భాగంలో లక్ష్మీనృసింహస్వామి ఆకారంలో సింహం తల కనిపిస్తుంది. కింది భాగంలో యోగ దీక్షలో కూర్చున కార్తికేయుడు కనిపిస్తాడు. ఇవేకాక కొండపై పార్కులు, స్తూపాలు, నమూనాలు, అశ్వమేధ యాగశాల, అలనాటి స్నానఘట్టాలు. 2006లో దలైలామా నాటిన బోధి వృక్షాలను కూడా చూడవచ్చు.


నందికొండలోని మ్యూజియం లోపలిభాగం

సింహాళవిహారం...

నాగార్జునకొండపై మ్యూజియం బయటి పడమటి భాగంలోని ప్రదేశాన్ని సింహాళవిహారం అంటారు. విహారం అంటే బౌద్ధ విద్యార్థులు నివాసం ఉండేచోటు. నాగార్జునసాగర్‌లో ఆచార్య నాగార్జునుడు స్థాపించిన నాగార్జున విశ్వవిద్యాలయంలో వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసించేవారు. అందులో సింహళులు(శ్రీలంక వారు) ఒకరు. వివిధ దేశాల వారు తమ దేశ సంస్కృతికి తగ్గట్టు వసతులు నిర్మించుకునే వారు. సింహళులు నిర్మించుకున్న విహారమే సింహాళవిహారంగా పేరుగాంచింది.

ధాన్యాన్ని కొలిచే కుండ

తవ్వకాల్లో బయటపడిన కుండ పెంకులను అన్నింటిని అతికించగా కుండ తయారైంది. నాడు ధాన్యాన్ని నిల్వ ఉంచేందుకు తయారుచేసిన బాణా ఇది. దీనిపై ఉన్న పుష్పాలు ఆనాటి కళాపోషణను తెలియజేస్తోంది. తవ్వకాల్లో దొరికిన చిన్న చిన్న పెంకులని అతికించి కుండను తయారుచేయడం పురావస్తు శాఖ పనితీరుకు నిదర్శనం.



- 1955లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో ఇక్కడి కొంత భాగం మునిగిపోయింది. ఈ క్రమంలో చారిత్రక అవశేషాలను పరిరక్షించేందుకు నందికొండకు తరలించి ఇక్కడ మ్యూజియంలో భద్రపరిచారు. అయితే వీటిలో కొన్ని కళాఖండాలు బ్రిటీష్‌వారు లండన్ మ్యూజియానికి తరలించారు. నాగార్జునకొండపై మూడు భాగాలు ఉన్నాయి అందులో మ్యూజియం, గార్డెన్, స్తూపాలు, ఇనుపరికరాలు.
- 1923 నుంచి 1960 వరకు నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల్లో పురావస్తు శాఖ నిర్వహించిన తవ్వకాలలో బయటపడిన శిలలు, శిల్పాలు,శాసనాలు,గౌతమ బుద్ధుని అస్తికలు మ్యూజియంలో ఉంచారు.
- శిల్పాలు, మండల స్తంభాలు అన్ని కలపి మొత్తం 138 వరకు ఉన్నాయి.
- మట్టి, ఇనుముతో చేసిన పనిముట్లు 70 వరకు ఉన్నాయి.
- గ్యాలరీని నాలుగు భాగాలుగా విభజించారు.
- నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ముందు నాగార్జునకొండ నమూనా తెలియజేసే పటం ఉంది.
- 9.56 అడుగుల ఎత్తయిన బుద్ధుడి విగ్రహం ఉంది.
- శృంగార భంగిమలను తెలిపే రస భరితమైన మథన శిల్పాలు. ఆనాటి సాంస్కృతిక, సాంప్రదాయాలను తెలిపే శిల్పాలూ ఉన్నాయి.

మొక్కు తీర్చుకోవడానికి వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో అక్కా తమ్ముడు మృతి
- ఏపీ రాష్ట్రంలోని నెల్లూరులో ఘటన
- మృతుల స్వస్థలం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం


ప్రమాదానికి ముందు తిరుపతిలో తీసుకున్న సెల్ఫీ, మృతులు నిమిష, కార్తీక్(మార్కింగ్‌లో ఉన్న వాళ్లు)

ఆత్మకూరు(ఎస్), మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి దర్శనానికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో అక్కా తమ్ముడు మృతి చెందగా, తల్లిదండ్రులు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరులో చోటుచేసుకోగా మృతుల స్వస్థలం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం పాతర్లపహాడ్ గ్రామం. కుమార్తెకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి వెళ్లి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన మోనంది మల్లయ్య, నాగమణి దంపతులు సూర్యాపేటలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఒక కుమార్తె నిమిష(23), కుమారుడు కార్తీక్(20) ఉన్నారు. ఇద్దరూ హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. కుమార్తె నిమిష ఇంజనీరింగ్ పూర్తికాగానే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. ఈ సందర్భంగా మొక్కు తీర్చుకునేందుకు ఈ నెల 5వ తేదీన కుటుంబంతో తిరుపతికి రైలులో వెళ్లారు. దర్శన అనంతరం శుక్రవారం గుర్తు తెలియని కారు ఒకటి సూర్యాపేటకు విజయవాడ మీదుగా వెళ్తున్నామని చెప్పడంతో విజయవాడలో కనకదుర్గమ్మ దర్శనం చేసుకుని వెళ్లవచ్చని ఆ కారులో బయలుదేరారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక నెల్లూరు సమీపంలో కార్ డ్రైవర్ నిద్రమత్తులో లారీకి ఎదురుగా వెళ్లి ఢీకొట్టడంతో కారు నుజ్జయ్యింది. ప్రమాదంలో నిమిష, కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందగా మల్లయ్య, నాగమణి దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. నిరుపేద కుటుంబానికి చెందిన మల్లయ్య ఇద్దరు సంతానం మృతి చెందడంతో పాతర్లపహాడ్ గ్రామంలో విషాదం అలుముకుంది.

కుటుంబకలహాలతో ఆత్మహత్య


సతీష్(ఫైల్‌ఫొటో)

అడ్డగూడూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో శనివారం జరిగింది. ఎస్‌ఐ నాగరాజు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామానికి చెందిన నిమ్మల సతీష్(25)కి తొమ్మిదేళ్ల కిందట తిరుమలగిరి మండలం గుండేపూరి గ్రామానికి చెందిన స్వప్నతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు స్వాతిక, వర్షిత ఉన్నారు. చిన్నప్పటి నుంచి సతీష్ తనకు కుమారుడు లేడని తాగి వచ్చి భార్య స్వప్నతో గొడవపడేవాడు. ఈ నెల 5వ తేదీన గొడవపడి భార్య స్వప్నను కొట్టడంతో ఆమె తన తల్లికి సమాచారం ఇచ్చింది. అదే రోజు రాత్రి ఆమె వచ్చి తన కుమార్తెను, పిల్లలను ఆటోలో తీసుకుని వెళ్లింది. అనంతరం 6వ తేదీ ఉదయం కోటమర్తికి వచ్చి అల్లుడికి నచ్చజెప్పింది. శుక్రవారం రాత్రి మొదట గదిలో సతీష్ భార్యాపిల్లలతో కలిసి పడుకోగా, మరో గదిలో ఆమె తల్లి నిద్రించింది. అర్ధరాత్రి 12.30 గంటలకు బయటకు వెళ్తున్న సమయంలో సతీష్ ఇంట్లో ఉరేసుకుని కనిపించడంతో కేకలు వేయడంతో భార్య స్వప్న మేలుకుని రక్షించే ప్రయత్నం చేసేలోగానే అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై శనివారం ఉదయం భార్య స్వప్న ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు తెలిపారు.

అమృత మహోత్సవంలో చేనేత స్టాల్స్


రాష్ట్రపతిభవన్‌లో పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ముర్ము, సిరిపురం స్టాల్స్‌లో వస్త్రాలను ప్రదర్శిస్తున్న కళాకారులు

భూదాన్‌పోచంపల్లి / సంస్థాన్‌నారాయణపురం, రామన్నపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో అమృత మహోత్సవంలో భాగంగా శనివారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన యాదాద్రి-భువనగిరి జిల్లాకు చెందిన పలు చేనేత వస్త్ర ప్రదర్శనలు (స్టాల్స్)ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సందర్శించారు. భూదాన్ పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాలు భేష్ అని కితాబుపలికారు. పోచంపల్లికి చెందిన ఆర్‌టీ పోచంపల్లి హ్యాండ్లూమ్ హ్యాండిక్రాఫ్ట్స్ కంపెనీ యజమాని ఆర్‌టీ బాలసుబ్రహ్మణ్యంకు చేనేత వస్త్రాల విక్రయాలకు ప్రదర్శనకు స్టాల్స్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అలాగే జిల్లాలోని సంస్థాన్‌నారాణపురం పుట్టపాక చేనేత కళాకారులు జాతీయ అవార్డు గ్రహీత గూడ శ్రీను, గూడ పవన్, రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన కళాభారతి హ్యాండ్లూమ్స్ ప్రొడ్యూసర్ కంపెనీకి చెందిన జెల్ల సత్యనారాయణ, జెల్ల శ్రీనాథం ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సరికొత్త డిజైన్లు రూపొందించి తద్వారా దేశం గర్వించదగిన కీర్తి పొందడం అభినందనీయమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కితాబు పలికారు. ఈ ఉత్సవాల్లో ప్రత్యక్షంగా మగ్గం నేయడాన్ని రాష్ట్రపతితో పాటు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పరిశీలించారు. కళాకారుల ప్రతిభను ప్రశంసించారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- వర్మీ కంపోస్ట్ తయారీపై దృష్టి సారించని అధికారులు
- నిర్వహణ అస్తవ్యస్తం

(ఆంధ్రజ్యోతి-తిరుమలగిరి(సాగర్)

చెత్తతో వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసి అదనపు ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 2021లో సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. సుమారు రూ.2.5లక్షలతో షెడ్లను నిర్మించారు. కానీ గ్రామ, మండల స్థాయి అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరకపోగా ఆయా షెడ్లలో నిర్వహణ పూర్తిగా లోపించి ప్రస్తుతం అవి అధ్వాన్నంగా, అస్తవ్యస్తంగా తయారయ్యాయి.


సీత్లాతండాలో కంపచెట్ల మధ్య నిర్వహణకు నోచుకోకుండా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు

అన్ని సౌకర్యాలతో షెడ్ల నిర్మాణం

చెత్తనిర్వహణ కోసం సెగ్రిగేషన్ షెడ్లను రెండు గుంటల విస్తీర్ణంలో ఉపాధిహామీ పథకం నిధులతో ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అదేవిధంగా గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించేందుకు శ్రీకారంచుట్టింది. తద్వారా సేకరించిన చెత్తను విభజించి తడి చెత్తను డ్రయింగ్ ప్లాట్‌ఫాంలలో ఆరబెట్టడం, పొడి చెత్తను రీసైక్లింగ్ కోసం ఆరు విడివిడి తొట్టిలలో ఉంచేలా ఏర్పాటుచేశారు. అదేవిధంగా కంపోస్ట్ ఎరువు తయారు కోసం రెండు నాడెపు కంపోస్ట్ తొట్లను నిర్మించారు.


నాయకునితండాలో పేరుకపోయిన చెత్తాచెదారం

అస్తవ్యస్తంగా షెడ్ల పరిస్థితి

సెగ్రిగేషన్ షెడ్లను నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రస్తుతం షెడ్లు నిర్వీర్యదశకు చేరుకున్నాయి. మండలంలోని ఏ గ్రామంలోనూ చెత్త ద్వారా కంపోస్ట్ ఎరువును తయారు చేస్తున్న పరిస్థితి కనిపించడం లేదు. వానాపాములు లేకుండా నామమాత్రంగా ఎన్నో నెలల క్రితం నాడెపు గుంతలను నింపి అధికారులు సందర్శనకు వచ్చినప్పుడు వాటిని చూపించేందుకు మాత్రమే వీటిని తూతూమంత్రంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నిలిచిన చెత్త సేకరణ

కొద్ది నెలలుగా గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరించడంలో గ్రామ స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో గ్రామాలు, తండాల్లోని వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు పెద్దఎత్తున పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. పలు గ్రామాల్లో చెత్తకుప్పలను తొలగించకుండా నిప్పు పెట్టడంతో కాలుష్యం పెరుగుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామాల్లో పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో పాటు పలురకాల అంటువ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ కార్మికులతో నిర్వహించాల్సిన పనులను కూడా చేయకుండా కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం సెగ్రిగేషన్ షెడ్ల చుట్టూ కంపచెట్లు, పిచ్చి మొక్కలు మొలిచి మూగజీవాలకు ఆవాసాలుగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. అయినా మండలస్థాయి పంచాయతీరాజ్ అధికారులు గ్రామాల్లో పర్యవేక్షించకుండా నిర్లక్ష్యం చేస్తుండడంతోనే ప్రభుత్వం ఆశించిన చెత్త నిర్వహణ, కంపోస్ట్ ఎరువు తయారీ ప్రక్రియ కొనసాగడం లేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి.

తండాల్లో చెత్తను తీసుకెళ్లడం లేదు



మా తండాలో ట్రాక్టర్ల ద్వారా ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించడమే లేదు. పంచాయతీ వర్కర్లు చెత్తను అక్కడక్కడ కుప్పలుగా చేసి కాల్చివేస్తున్నారు. ఎన్నో నెలలుగా తండాలో ఇదే పరిస్థితి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

సపావత్ నెహ్రూ, సపావత్‌తండా

10 రోజుల్లో ఎరువు తయారు చేయిస్తాం

మండలంలోని గ్రామపంచాయతీల్లోని సెగ్రిగేషన్ షెడ్లలో వచ్చే 10 రోజుల్లో డీకంపోజర్ తెప్పించి కంపోస్ట్ ఎరువు తయారీ చేయిస్తాం. షెడ్ల నిర్వహణను మెరుగుపర్చడంతో పాటు సెగ్రిగేషన్ షెడ్లను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తాం.

భిక్షంరాజు (ఎంపీవో, తిరుమలగిరి(సాగర్))

ఇద్దరు సీఐలు, ఎస్‌ఐపై బదిలీవేటు!

- వన్‌టౌన్ సీఐగా మోతీరాం


రూరల్‌సీఐగా నియమితులైన పీఎన్డీప్రసాద్, ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న సైదులు

మిర్యాలగూడ అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడటూ టౌన్ సీఐతో పాటు రూరల్ సీఐ, ఎస్‌ఐలను బదిలీ చేస్తూ రెండోమల్టీజోన్ ఐజీ సత్యనారాయణ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. టూటౌన్ సీఐగా ఏడాదిన్నర కాలంగా పనిచేస్తున్న నాగార్జునను ఉన్నట్టుండి మల్టీజోన్-2 ఐజీకార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇటీవల ఓ డిజిటల్ పేపర్ విలేకరులకు రూ.1.10లక్షల నగదును ముట్టజెప్పి, ఆ తరువాత సదరు పేపర్ విలేకరులు తమను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి కేసునమోదు చేయించిన వివాదంలో రూరల్ సీఐ వీరబాబు పడ్డారు. దీనిపై దృష్టి సారించిన ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయన్ను మల్టీజోన్-2కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులుజారీ చేశారు. ఇప్పటివరకు రూరల్ సీఐగా బాధ్యతలు నిర్వహించిన వీరబాబు స్థానంలో హైదరాబాద్‌లోని మొఘల్‌పూర పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో పీఎన్డీ ప్రసాద్‌కు రూరల్ సీఐ బాధ్యతలు అప్పగించారు. ఐజీ ఆఫీసులో వీఆర్‌లో ఉన్న జీ సత్యనారాయణను టూటౌన్ సీఐగా బదిలీచేశారు. కొద్దినెలలుగా ఖాళీగా ఉన్న వన్ టౌన్ సీఐ పోస్టింగ్‌ను మోతీరాంకు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే ఆరునెలల క్రితమే సూర్యాపేట నుంచి బదిలీపై వచ్చి రూరల్ ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన పిల్లి లోకేష్‌కుమార్‌పై బదిలీ వేటుపడింది. ఎస్‌ఐ లోకేష్‌కుమార్‌ను మల్టీజోన్-2కు అటాచ్‌చేసి ఆయన స్థానంలో చౌటుప్పల్‌లో పనిచేస్తున్న లక్ష్మయ్యకు పోస్టింగ్ ఇచ్చారు. మిర్యాలగూడ సబ్‌డివిజన్ పరిధిలో పనిచేస్తున్న టూటౌన్, రూరల్ సీఐతో పాటు రూరల్ ఎస్‌ఐలకు ఏకకాలంలో స్థానచలనం కల్పించడం పోలీస్‌శాఖలో చర్చనీయాంశంగా మారింది. కాగా బదిలీపై ఇక్కడకు వస్తున్న పోలీస్ అధికారులు నేడో, రేపో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

రూరల్ స్టేషన్‌కు మరో ఎస్‌ఐ

మిర్యాలగూడరూరల్ పోలీస్‌స్టేషన్‌కు మూడో ఎస్‌ఐని కేటాయిస్తూ ఎస్పీ శరత్‌చంద్రపవార్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ స్టేషన్‌లో ఇప్పటికే ఇద్దరు ఎస్‌ఐలు పనిచేస్తుండగా మూడో ఎస్‌ఐని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ ఎస్‌ఐగా పదోన్నది పొందిన ఏ సైదులును మూడో ఎస్‌ఐగా బాధ్యతలు ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించారు. దీంతో శనివారం ఆయన రూరల్ స్టేషన్ విధుల్లో చేరారు.

'నామినేటెడ్'పై చిగురిస్తున్న ఆశలు

(5వ పేజీ తరువాయి)

ధీమాలో ఉండగా, సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌గా పనిచేసిన ఎరగాని నాగన్న పేర్లను సైతం అధిష్ఠానం పరిశీలిస్తోందని చెబుతున్నారు.

కీలక నాయకులకు రాష్ట్ర కార్పొరేషన్ పదవులు!

కాంగ్రెస్ 2014 నుంచి 2023 వరకు సుమారు పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీనే నమ్ముకొని ఉండడంతో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే సీట్లు పొందలేకపోయిన వారు, ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడ్డ నాయకులు పెద్ద సంఖ్యలో ఉమ్మడి జిల్లా నుంచి కార్పొరేషన్ల చైర్మన్లుగా పదవులు ఆశిస్తున్నారు. నల్లగొండ నియోజకవర్గంలో పార్టీని ముందుకు నడిపి, క్యాడర్‌ను కాపాడుకుంటూ వచ్చిన గుమ్మల మోహన్‌రెడ్డికి రాష్ట్రస్థాయి పదవి రానున్నదని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్వయంగా రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బహిరంగంగా ప్రకటించారు. తాజాగా, ఆయన బయోడేటాను అధిష్ఠానం వద్దకు తీసుకెళ్లారని, త్వరలో జరిగే నియామకాల్లో ఆయనకు పదవి ఖాయమని చెబుతున్నారు. అదేవిధంగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మాజీ మంత్రి జానారెడ్డితో కలిసి సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన ముఖ్య అనుచరుడు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డికి సైతం కీలక పదవి దక్కుతుందని, ఈ మేరకు అధిష్ఠానం నుంచి క్లియరెన్స్ కూడా వచ్చిందని చెబుతున్నారు. కాంగ్రెస్ సీనియర్ల జాబితాలో ఈ నేతలిద్దరికీ అవకాశాలొస్తాయని తెలుస్తోంది.

వీరితో పాటు నకిరేకల్ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో టిక్కెట్ అవకాశం కోల్పోయిన దళితనేత, పీసీసీ ప్రధానకార్యదర్శి కొండేటి మల్లయ్యకు సైతం ఎన్నికల సమయంలో పార్టీ ఇచ్చిన హామీ మేరకు కార్పొరేషన్ పదవి దక్కడం ఖాయంగా చెబుతున్నారు. పార్టీ యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న అండెం సంజీవరెడ్డి, ఉమ్మడి రాష్ట్రంలో ఐడీసీ సంస్థ డైరెక్టర్లుగా పనిచేసిన సాముల శివారెడ్డి (హుజూర్‌నగర్), కంచర్ల యాదగిరిరెడ్డి (తుంగతుర్తి) కూడా కార్పొరేషన్ పదవులు వస్తాయనే నమ్మకంలో ఉన్నారు. పీసీసీ సభ్యుడు దొంగరి వెంకటేశ్వర్లు కూడా కార్పొరేషన్ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కోదాడ నియోజకవర్గం నుంచి సీనియర్ నేతలు ముత్తవరపుపాండురంగారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డికి కూడా పరిస్థితులు అనుకూలిస్తే కీలక పదవులు దక్కవచ్చనే చర్చ సాగుతోంది. యాదాద్రి జిల్లా నుంచి పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, పంజాల రామాంజనేయులుగౌడ్, పల్లె శ్రీనివాస్‌గౌడ్, లింగంయాదవ్ కూడా కార్పొరేషన్ పదవులు ఆశిస్తున్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జూలూరి ధనలక్ష్మి మహిళా కోటాలో తనకు రాష్ట్ర స్థాయి పదవి ఇవ్వాలని కీలక నేతలను అభ్యర్థిస్తున్నారు. వీరేగాకుండా ఇంకా పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు, ఎమ్మెల్యేల విజయంలో కీలకపాత్ర వహించిన నాయకులు తమకు ముఖ్యపదవులు వస్తాయనే ఆశతో వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

కల్యాణం.. కమనీయం..

వైభవంగా లక్ష్మీనృసింహుల బ్రహ్మోత్సవ కల్యాణం


ఆలయ ఉత్తర తిరువీధిలో భక్తజన సందోహం

యాదగిరిగుట్ట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : లోక కల్యాణం కోసం జగద్రక్షకుడు.. భక్త జనబాంధవుడు స్వయంభువు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశేష ఘట్టం ఎనిమిదో రోజు శనివారం శాస్త్రోకంగా జరిగింది. లోక కల్యాణమే పరమావరధిగా.. దేవదేవుడితో లక్ష్మీఅమ్మవారి కమనీయ కల్యాణ వేడుకలు భక్తజనులకు కనువిందు చేశాయి. వేడుకలకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.శ్రీధర్, కలెక్టర్‌దంపతులు స్వామివారికి ప్రభుత్వ తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించగా ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రి వెంకట్‌రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు పంపారు.

శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకలు

జగత్కల్యాణ కారకుడు.. భక్తజనబాంధవుడు నృసింహుడి శాంతి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. సర్వాంగసుందరంగా ముస్తాబైన ఉత్సవమూర్తుల కల్యాణ వేదికపై వేద మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్యన కల్యాణ తంతు వైభవంగా జరిగింది. అనంతరం జరిగిన వేడుకల్లో ముక్కోటి దేవతలు ఆహూతులుగా, చతుర్ముఖ బ్రహ్మాదిదేవతల సమక్షంలో దేవదేవుడు నృసింహుడు లోక కల్యాణార్థం సముద్రుడి తనయ లక్ష్మీదేవి అమ్మవారి మెడలో రాత్రి అభిజిత్‌లగ్న సుహూహూర్తానా రాత్రి 10.48 గంటలకు శుభఘడియలలో వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య మాంగల్యధారణ గావించారు. పట్టు వస్త్రాలు, బంగారు, వజ్రవైడూర్య, ముత్యాల ఆభరణాలతో నవ వరుడిగా అలంకృతుడైన లోక కల్యాణ కారకుడు నరసింహుడు గజవాహనంపై మండపానికి ఊరేగింపుగా వేంచేశారు. భక్తజనకోటికి సకల సంపదలను ప్రసాదించే లక్ష్మీఅమ్మవారు పుష్ప పల్లకిలో భక్త జనుల జయ జయ ధ్వానాలు, రుత్వికుల వేదపారాయణాలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా మండప వేదికపై ఉత్సవ మూర్తులను ఉత్సవ కల్యాణ మండపంపై అధిష్టింపచేశారు. లక్ష్మీనృసింహుల కల్యాణ వేడుకలను పాంచారాత్రాగమ శాస్త్ర రీతిలో విశ్వక్సేనుడికి తొలి పూజలతో ఆరంభించారు. వేద ప్రాశస్త్యమైన మంత్రోచ్చరణలతో స్వామి వారికి యజ్ఞోపవీత్రధారణ చేశారు. దేవదేవుడు నృసింహుడికి లక్ష్మీ అమ్మవారి తండ్రి సముద్రుడు పాద ప్రక్షాళన చేసిన అనంతరం కన్యాదానం తంతును గావించారు. కల్యాణ సాంప్రదాయంలో వధూవరుల శిరస్సులపై జలకర, బెల్లం కార్యక్రమం ఆగమశాస్త్ర రీతిలో సాగింది. అనంతరం మాంగళ్యం తంతూ నానేనా అనే అర్చకుల వేద మంత్రోచ్చరణలు, భక్త జనుల గోవింద నామస్మరణల మధ్య అమ్మవారి మెడలో మాంగల్యధాఆరణ జరిగింది. కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు నల్లంధీగళ్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు, ఆగమ శాస్త్ర పద్ధతిన నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నర్సింహమూర్తి దంపతులు అమ్మవారిని ఇంటి ఆడపడుచుగా భావించి పట్టు వస్త్రాలు సమర్పించగా ఈవో ఏ.భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, జూశెట్టి క్రిష్ణ, గజ్వేల్లి రమేష్ బాబు, రఘు, పర్యవేక్షకులు నాగుల మహేష్‌గౌడ్, దీరావత్ రామరావునాయక్, రాజన్‌బాబు, వాసం వెంకటేశ్వర్లు, దాసోజు నరేష్, రాకేష్‌రెడ్డి, ముద్దసాని నరేష్, వేములవెంకటేశ్, ఉద్యోగ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో స్థానిక భక్తులు

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యాదగిరిగుట్ట పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉత్తర తిరువీధిలో కల్యాణ మండపాన్ని రూపొందించారు. కొండపైన ఆకాశమంత పందిరి.. భూదేవి అంత పీటలు వేసిన చందంగా స్వామివారి బ్రహ్మోత్సవ కల్యాణ వేడుకలు కన్నుల పండువగా భక్తులు వీక్షించారు. దేదిప్యమానంగా కల్యాణ మండపం విద్యుత్ కాంతులీనుతుండగా బంగారు వర్ణంతో అత్యంత శోభాయమానంగా కనువిందు చేసింది. ఒకవైపు కల్యాణ వేడుకలు సాగుతుండగా టపాసులు పేలుతుండగా మండపం పైనుంచి పూలు వర్షం కురిపించారు. ప్రముఖుల కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు.


ప్రత్యేక అలంకారంలో స్వామివారు


నృసింహుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


పట్టువస్త్రాలు తెస్తున్న విప్, ఎంపీ, కలెక్టర్

శ్రీ రాముడిగా పంచనారసింహుడు

హనుమంత వాహనంపై ఊరేగింపు



యాదగిరిగుట్ట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారంతో ఎనిమిదివ రోజుకు చేరాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం జరిగిన వేడుకల్లో స్వామివారిని శ్రీ రాముడి అలంకరణలో ముగ్ధమనోహరంగా అలంకరించి, తిరువీధిలో ఊరేగింపు చేపట్టారు. నిత్యారాధనల అనంతరం హవనాలు, వేద పండితుల పారాయణాలు చేసి ఉదయం పట్టు వస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలు, వజ్రవైఢూర్యాలతో శ్రీ రాముడి అలంకరణలో హనుమంత వాహన సేవ లో అధిష్టింపజేసి స్వామివారి తిరువీధి సేవ నిర్వహిచా రు. వేద పండితులు మంత్ర పఠనాలు, పారాయణికుల వేద పారాయణాల నడుమ ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు మారుమోగుతుండగా భక్తుల జయ జయధ్వానాల నడుమ వేడుకలు వైభవంగా నిర్వహించారు.

హనుమంత సేవ ప్రత్యేకత



దుష్ట శిక్షణ...శిష్ట రక్షణార్థం.. లోకోత్తర కల్యాణ గుణాలతో మూర్తీభవించిన ధర్మమూర్తిగా అవతరించిన అవతారమే శ్రీ రామ అవతారం. దశ అవతారాల్లో ఒక అవతారంగా భావించే శ్రీ రాముడి హనుమంత వాహన సేవ కూడా ప్రత్యేకమే. సీతాదేవి అన్వేషణలో శ్రీ రాముడికి అండగా హనుమంతుడు శక్తియుక్తులను ధార పోసి సీతమ్మ జాడ కనిపెట్టాడు. అతి గుణవంతుడుగా కీర్తిప్రతిష్ఠలు సొంతం చేసుకున్న ఆదర్శమూర్తి శ్రీరాముడిగా కలియుగంలో భక్తజనులు కొలిచి పూజిస్తారు. పుత్రుడు, శిష్యుడు, భర్త, నృపాలుడు, సర్వజనహితుడు, సత్యవాక్ పరిపాలకుడు, యుద్ధ కుశలుడు, ఏకపత్రివ్రతుడు, శరణాగత వత్సలుడు అనేక గుణాల కలబోత శ్రీ రాముడి అవతారం. రామసేవా దురంధరుడు ప్రభుభక్తి పారాయణుడు, బలవీర్య తేజశ్శాలి, భక్తాగ్రేగణ్యుడు, చిరంజీవి, ఆరాధ్య చరితుడు ఆదర్శ పురుషోత్తముడిగా శ్రీ రామ అలంకరణలో హనుమద్వాహనరూఢుడై భక్తులకు దర్శనం కలిగించడం ఎంతో అపూర్వమని ప్రధానార్చకుడు నల్లందీగల్ లక్ష్మీనరసింహచార్యులు వివరించారు.

అలరించిన సంగీత సభలు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండపై ధార్మిక, సాహిత్య, సంగీత సభలు కొనసాగాయి. ఉదయం 6 నుంచి 6.45 గంటల వరకు శ్రీ కృష్ణ (తిమ్మాపురం) భజన మండలి, 6.45 నుంచి 7.30 గంటల వరకు శ్రీ రామ (మల్లాపురం) భజన మండలి భజనలు, 7.30 నుంచి 8 గంటల వరకు ఆస్థాన విద్వాంసుల మంగళవాద్యం, 8 నుంచి 8.30 గంటల వరకు ఆస్థానార్చకుల వైదిక ప్రార్థన, 8.30 నుంచి 10 గంటల వరకు బొమ్మశ్రీ మైలవరపు శ్రీనివాస్‌రావు (హైదరాబాద్) నవ నారసింహ క్షేత్ర వైభవ ఉపన్యాసం, 10 నుంచి 11.30 గంటల వరకు పురాణం విజయలక్ష్మీ (రాజమండ్రి) సుగ్రీవ పట్టాభిషేకం హరికథాగానం, 11.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు దుర్గా మైత్రేయ బృందం (హైదరాబాద్) వీణావాద్యం, 12.15 నుంచి ఒంటి గంట వరకు కౌటూరి గాయత్రి (ఖమ్మం) భక్తి సంగీతం, 1 నుంచి 1.30 గంటల వరకు మృత్యాంజలి డాన్స్ ఇన్‌స్టిట్యూట్ (హైదరాబాద్) కూచిపూడి నృత్యం, వెంకట అన్నమాచార్య ప్రాజెక్టు బృందం (హైదరాబాద్) స్వామివారి సేవ ముందు కోలాట నృత్యం, 4 నుంచి 4.45 గంటల వరకు మయూరి నృత్యాలయం (హైదరాబాద్) కూచిపూడి నృత్యం, 5 నుంచి 6 గంటల వరకు దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఫైన్ ఆర్ట్స్ చిలకమర్రి సిస్టర్స్ బృందం (హైదరాబాద్) భక్తి సంగీత, 6 నుంచి 7 గంటల వరకు కుమారి జయప్రద, రామూర్తి (హైదరాబాద్) వేణుగానం ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

ఉచిత వైద్య శిబిరం

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండపైన నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 11 వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించారు. కో-ఆర్డినేటర్ ఎడ్ల భరత్‌రెడ్డి, వైద్యులు శివకుమార్ సుమారు 150మంది రోగులకు వైద్య సేవలందించారు. ఆదివారం వరకు సాయి సంజీవిని ఆసుపత్రి డాక్టర్ అంజయ్య (ఎంఎస్) ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

వార్షిక బ్రహ్మోత్సవాల్లో 9వ తేదీన రాత్రి రథోత్సవం, ఉదయం గరుడ వాహనసేవలో శ్రీ మహావిష్ణు అలంకరణలో స్వామివారి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వేసవిలో ఇబ్బందులు రాకుండా చూడాలి

(5వ పేజీ తరువాయి)

ఎస్‌డీఎఫ్ కింద రూ.10.30కోట్లు కావాలని, జిల్లాలో 26 సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. విద్యుత్‌కు సంబంధించి సమస్యలు లేవని, సబ్ డివిజన్ వారీగా సమీక్షించి 250 ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని గుర్తించామన్నారు. తొమ్మిది క్విక్ రెస్పాన్స్ టీం వాహనాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నాగార్జునసాగర్ ద్వారా రెండు పంటలకు సాగునీరు ఇస్తున్నామని, వచ్చే పది రోజుల వరకు ప్రస్తుతం ఉన్న నీటి సరఫరా కొనసాగుతుందని, ఆ తర్వాత శ్రీశైలం నుంచి సాగునీటిని విడుదల చేయాల్సి ఉందన్నారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలన్నారు.


సమీక్షా సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు

● యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ మాట్లాడుతూ, తాగునీరు, ఇరిగేషన్, విద్యుత్ పరిస్థితులను మంత్రులు, శాసనసభ్యులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.



● భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మిషన్ భగీరథ కింద 100 లీటర్ల నీరు అందడం లేదని, తన నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో బోర్ల ద్వారా కూడా తాగునీటి సరఫరా అవుతోందని, అయితే బోర్ నీళ్లు, తాగునీరు కలిసిపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. కొన్ని చోట్ల కొత్త బోర్లు అవసరం ఉన్నాయని తెలిపారు. పిలాయిపల్లి, బునాదిగాని కాల్వ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. బస్వాపురం ఆర్‌అండ్ఆర్ కింద చెల్లింపులు వెంటనే చేయాలని, కాల్వల్లో గుర్రపుడెక్క తీయాలని, కాల్వలపై ఏర్పాటు చేసిన మోటార్లను నియంత్రించాలన్నారు.



● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ, సుదర్శపురం వాటర్ ట్యాంక్‌ను పూర్తిచేయాలని, మోత్కూరు జనాభాకు అనుగుణంగా తాగునీటిని సరఫరా చేసేందుకు పైప్‌లైన్ డయా పెంచాలని, అలాగే తండాల్లో బోర్లకు మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. జాలిపురం వరకు సాగునీరు ఇచ్చేందుకు మరో రెండు మూడు రోజులు ఎస్ఎల్‌బీసీ నీటిని విడుదల చేయాలన్నారు. ఎస్సారెస్పీ కింద బిక్కుమల్ల వరకు నీరు రావడంలేదని, నూతనకల్ దాటి నీరు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కాల్వల్లో జంగిల్ కటింగ్ చేయాలన్నారు.



● నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ, గత ఏడాది తన నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో తాగు నీటి కొరతతో ప్రజలు ఇబ్బంది పడ్డారని, ప్రస్తుతం తండాల్లో బోర్ల వద్ద తాగునీరు తెచ్చుకుంటున్నారని, కొత్త బోర్లు వేసుకునేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. అలాగే అద్దె బోర్ల ధర పెంచాలని, నిడమనూరు చెరువును నీటితో నింపితే నిడమనూరు, హాలియా మునిసిపాలిటీకి తాగునీరు అందుతుందని అన్నారు.



● దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ, తాగునీటి సరఫరాకు కృషి చేయాలని, పెండ్లిపాకల ప్రాజెక్టు కింద ఏజెన్సీకి వేతనాలు చెల్లించాలని, ప్రతీ గ్రామంలో అద్దె బోర్లు తీసుకునేందుకు బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి కోసం కలెక్టర్ల వద్ద నిధులు అందుబాటులో ఉంచాలన్నారు.



● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, తాగునీటి కోసం ప్రతీ నియోజకవర్గానికి కొద్ది మొత్తంలో నిధులను కేటాయించి కలెక్టర్ నియంత్రణలో ఉంచాలని, గ్రామపంచాయతీలో తాగునీటి సమస్య ఏర్పడితే పరిష్కరించేందుకు ఆ నిధులను వినియోగించాలన్నారు. తన నియోజకవర్గంలో రెండు మూడు గ్రామాల్లో తీవ్ర నీటిఎద్దడి ఉందన్నారు. ఏఎమ్మార్పీ ద్వారా తక్కువ మొత్తంలో కాల్వలకు సాగునీరు వస్తోందని, మరో 10 రోజులపాటు నీరు వదలాలని, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు కింద జాతీయ రహదారి క్రాసింగ్‌కు అనుమతి తీసుకోవాలని కోరారు.



● మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, మిషన్ భగీరథ ఏజెన్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, దామరచర్ల, అడవిదేవులపల్లి, మిర్యాలగూడలో తండాలు ఎక్కువగా ఉన్నాయని, గత సంవత్సరం అద్దె బోర్లకు చెల్లించిన మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. వజీర్‌బాగ్ కాల్వ చివరి వరకు సాగునీరు ఇవ్వాలని, డీ-40 కింద నీరు రావడం లేదని కోరగా, ఈ విషయంపై ఇన్‌చార్జి మంత్రి స్పందిస్తూ ముందుగా కాల్వ చివరలో ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందించిన తర్వాత పైభాగాన ఉన్న వాటికి తర్వాత అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



● ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, గుండాల మండలంలో 50శాతం పంటలకే నీరు వస్తున్నదని, మరో వారం పాటు 200 క్యూసెక్కుల నీరు వదిలితే ఆత్మకూరు ప్రాంతంలోని చివరి ఆయకట్టుకు సాగునీరు వస్తుందని కోరారు.

● కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి మాట్లాడుతూ, మునుగోడు వరకు సాగునీరు అందించాలని, ఇరిగేషన్, అగ్రికల్చర్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో నీటి విషయంలో స్పష్టత లేదని అన్నారు. లైన్ డిస్ట్రిబ్యూటర్లు, కండక్టర్లు, కేబుల్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని కోరారు. దీంతో ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందిస్తూ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ప్రతీ రోజు నివేదిక ఇవ్వాలన్నారు. దీనిపై కలెక్టర్లు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఎన్‌సీ హరిలాల్, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే పద్మావతిని సన్మానిస్తున్న మంత్రులు తుమ్మల, వెంకట్‌రెడ్డి

నేటినుంచి రేపాల నృసింహుడి బ్రహ్మోత్సవాలు


రేపాలలోని నృసింహుడి దేవాలయం

మునగాల రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని రేపాల గ్రామం శివారు గుట్ట సొరంగంలో వేంచేసి ఉన్న స్వయంభు లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయి. పది రోజుల పాటు యాదిగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల విధంగా నిర్వహిస్తారు. శనివారం అర్ధరాత్రి నడిగూడెం మండలం సిరిపురం గ్రామం కోదండ రామా లయం నుంచి నరసింహుడి, ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనంలో తీసుకొని రేపాల గ్రామానికి తీసుకొచ్చి ఊరేగింపుగా నిర్వహిస్తారు. అనంతరం గుట్ట పైకి స్వామి, అమ్మవార్లను చేరుస్తారు. స్వామి రాకతో గ్రామంలో ఉదయం ఐదు గంటలకే ప్రతి ఒక్కరూ ఇంటి ఎదుట ముగ్గులు వేసి స్వామికి మంగళహారతులు, కొబ్బరి కాయలు ఇచ్చి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. స్వామి ఊరేగింపులో నరసింహుని, వినాయక వేషధాణలు, కోలాట నృత్య ప్రదర్శనలు ఉంటాయి.

కార్యక్రమాలు ఇలా..

10న అధ్యనోత్సవం, 11న పరమనదోత్సవం, 12న ధ్వజారోహణ, 13న డోలోత్సవం రాత్రి ఎదుర్కోలు, స్వామి కల్యాణం, 14న లక్ష కుంకుమార్చన, రాత్రి గరుడ సేవ, 15న రథోత్సవం, 16న చక్రతీర్థం, 17న మధ్యాహ్నం గాంధోళి(వసంతోత్సవం), 18న పవళింపు సేవ,



బాప్టిస్టు చర్చికి మంత్రి ఉత్తమ్ రూ.5లక్షల విరాళం

నేరేడుచర్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలోని ఉప్పలేని బాప్టిస్ట్ చర్చి అభివృద్ధికి నీటి పారుదలశాఖా మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.5లక్షల విరాళం ఇచ్చారు. ఆ నగదును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకటరెడ్డి శనివారం చర్చి పాదర్ శ్యామ్‌డేవిడ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకవీడు మాజీ ఎంపీపీ భూక్యాగోపాల్, మాజీ జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, మోతీలాల్, వెంకటసైదులు, పాండునాయక్, పగిడిపాటి సైదిరెడ్డి, జొన్నలగడ్డ సైదులు, అబ్రహం, దేవయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి ఉత్తమ్ పంపిన రూ.5లక్షల విరాళం అందజేస్తున్న చిన వెంకటరెడ్డి

'ఉపాధి' పనులు పకడ్బందీగా నిర్వహించాలి

చిట్యాలరూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌డీఏ అదనపు పీడీ నవీన్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని 18గ్రామాల్లో రూ.2.25 కోట్లకు సంబంధించిన పనుల ఖర్చుపై శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో పనులు నిర్వహించే సిబ్బంది ఎలాంటి పొరపాట్లు లేకుండా పనులను చేయించాలని కూలీలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో జరిగే పనుల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా అధికారులు తగిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నిధులు పక్కదారి పట్టకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. గత ఏడాది జరిగి పనుల్లో రూ.8,010లు సామాజిక తనిఖీలో తేడా వచ్చిందన్నారు. కూలీల డబ్బులు, ఖర్చులో ఎలాంటి తేడాలు రాకూడదన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల అధికారి ఫసీయుద్దీన్, ఎంపిడిఓ కార్యాలయం సూపరింటెండెంట్ గంపల మనోహర్, ఇన్‌చార్జి ఎంపిఓ మట్టపల్లి కృష్ణయ్య, విజిలెన్స్ అధికారి ఫయాజ్, పీఆర్ ఏఈ సందీప్‌రెడ్డి, ఏపీవో వనం శ్రీలత పాల్గొన్నారు.

చెట్లపొదల్లోకి దూసుకెళ్లిన కారు

మోటకొండూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లిలో శనివారం జరిగింది. ఎస్‌ఐ ఉపేందర్‌యాదవ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు(ఎం) మండలంలోని సింగారం గ్రామానికి చెందిన జామ శంకర్ మండలంలోని పల్లెర్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. భార్యతో కలిసి భువనగిరిలో నివాసముంటున్నాడు. శనివారం పాఠశాలకు సెలవురోజు కావడంతో విద్యార్థులను విహారయాత్రకు తీసుకెళ్లేందుకు నిర్ణయించుకుని తెల్లవారుజామునే భువనగిరి నుంచి పల్లెర్లకు వస్తున్నారు. ఉదయం 7గంటల సమయంలో కాటేపల్లి వంతెన వద్దకు రాగానే వంతెనపైన కంకర తేలి ఉండడంతో కారు టైర్లు ఒక వైపు లాగడంతో స్పీడ్‌గా ఉన్న కారు వంతెన పైనుంచి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా శంకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

చిట్యాల, మార్చి8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా మునిసిపల్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య కోరారు. సీపీఎం చేపట్టిన సర్వే కార్యక్రమంలో భాగంగా శనివారం చిట్యాల మునిసిపాలిటీలోని 2వ వార్డులో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మునిసిపాలిటీ ఏర్పడక ముందు ఇళ్లు నిర్మించుకున్న వారికి రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సరోజ, సుధాకర్‌రెడ్డి, యాదయ్య, వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టింగ్‌లను వెంటనే ఇవ్వాలి

నల్లగొండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జూనియర్ లెక్చరర్ల అభ్యర్థులకు వెంటనే పోస్టింగ్ ఆర్డర్‌లు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎడ్ల సైదులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఈ నెల 11వ తేదీన తలపెట్టిన మహా పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. 2024లో ఫలితాలు వెల్లడించిన ఫలితాల్లో 1392 మంది అభ్యర్థులు ఎంపికైనప్పటికీ ఇంతవరకు పోస్టింగ్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు.

ఆయిల్‌పాం సబ్సిడీ రూ.3.96 కోట్ల

విడుదలకు ఉత్తర్వులు

నల్లగొండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆయిల్‌పాం సబ్సిడీ డబ్బులు రూ.3 కోట్ల96 లక్షల 82 వేలకు పైగా రైతుల ఖాతాలో జమ చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశం సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల దృష్టికి పెండింగ్ సబ్సిడీల విషయాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పెండింగ్ సబ్సిడీ నిధులు విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయిల్‌పాం రైతుల తరపున బోయినపల్లి జగన్మోహన్‌రావుతో పాటు రవీందర్‌రెడ్డి శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బహుమతుల ప్రదానం

కనగల్, మార్చి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో వేమిరెడ్డి నారాయణరెడ్డి, అనుమల వెంకన్నల జ్ఞాపకార్థం పది రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. చండూరు జట్టు టైటిల్‌ను సాధించగా, రామచంద్రాపురం జట్టు రన్నరప్‌గా నిలిచింది. కురంపల్లి జట్టు మూడో స్థానాన్ని దక్కించుకుంది. విజేత జట్లకు ప్రథమ బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలను కప్‌తో పాటు గ్రామ మాజీ ఉపసర్పంచ్ వేమిరెడ్డి దిలీప్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో అనుముల వెంకన్న, పెద్దులు పాల్గొన్నారు.

కోతులు బాబోయ్ కోతులు



» గ్రామాల్లో గుంపులుగుంపులుగా సంచారం
» ఇళ్ల పెంకులు, రేకులు, పంట పొలాలు, పండ్ల చెట్లు ధ్వంసం
» భయభ్రాంతులకు గురవుతున్న జనం

శాలిగౌరారం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలో కోతుల బెడద రోజు రోజుకు పెరిగిపోతోంది. దీంతో ప్రజలకు భయభ్రాంతులకు గురవుతున్నారు. రాత్రనక పగలనక కోతులు సంచరిస్తుండటంతో ప్రజలు బయటకు రావడానికి కూడా భయపడుతున్నారు. శాలిగౌరారం మండలంలో 24 గ్రామాలతో పాటు మరో 10 ఆవాస గ్రామాలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లోనూ కోతులు నిత్యం స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు కోతులంటే బెంబేలెత్తుతున్నారు. కాలనీలు, గృహాల్లో కోతులు తిరుగుతున్నాయి. ఇళ్లల్లో, దుకాణాల్లో తినుబండారాలను, వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. కూరగాయలు, పండ్ల చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. బజారులో వెళ్తున్న ప్రజలను, వాహనదారులను వెంబడిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. బజారులో ఏమైనా వస్తువులు పట్టుకెళ్తుంటే వెంబడించి, ఎగబడి గుంజుకొని తింటున్నాయి. ఇంటి తలుపు లు తీసి ఉంటే అంతే సంగతి. ఇళ్లంతా కోతులదే రాజ్యం. కోతుల బెడదతో ఎప్పుడేమి జరుగుతుందో అర్థం కావడం లేదని ప్రజలు నిత్యం భయపడుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా కోతులు దాడిలో ఎంతో మంది ఆస్పత్రి పాలయ్యారు. కోతుల బెడదను నివారించడంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. అడవులు అంతరించిపోవడంతో గ్రామాల బాట పట్టాయి. శాలిగౌరారం మండల కేంద్రంలో పదేళ్ల నుంచి కోతుల బెడద ఎక్కువైంది. ఎక్కడ చూసినా వానర సైన్యం కనిపిస్తుంది. ఏ వీధి చూసినా, ఏ రోడ్డు చూసినా, ఏ ఊరు చూసినా కోతులే కనిపిస్తున్నాయి. పెంకుటిండ్లు, రేకుల ఇళ్లపై చెట్ల కొమ్మలపై నుంచి దూకుతూ పెంకులు, రేకులను ధ్వంసం చేస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండ్ల, కూరగాయల మొక్కలను, వరి చేను కొనలను ధ్వంసం చేస్తుండటంతో రైతులకు ప్రజలకు నష్టం వాటిల్లుతోందని ఆందోళన చెందుతున్నారు. కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. కొన్ని సందర్భాల్లో కోతులు రెండు గ్రూపులుగా ఏర్పడి దాడులకు పాల్పడుతున్నాయి. రోడ్ల వెంట వెళ్తున్న వ్యక్తులు, విద్యార్థులు, యువకులు, మహిళలు కోతుల భయంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, హాస్టల్, వివిధ బ్యాంకులు, దుకాణాలు, హోటళ్లు, వ్యవసాయ మార్కెట్, సబ్‌స్టేషన్ ఆవరణలో కోతులు అధికంగా ఉంటున్నాయి. చెట్లు, భవనాలపై, ఇళ్లపై సేదతీరుతూ రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సబ్‌స్టేషన్‌లో అపార నష్టం

శాలిగౌరారంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏడాదికి రెండు, మూడు సార్లు ఎంతో విలువైన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఖాళీ పోయి లక్షల రూపాయల ఆస్తి నష్టం జరుగుతుంది. ఈ సబ్ స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలోకి కోతులు గుంపులు గుంపులుగా వచ్చి స్తంభాలు ఎక్కడంతో ఫేస్ టూ ఫేస్ అయి పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్లు ఖాళీ పోతున్నాయి. దీంతో ఆస్తినష్టంతో పాటు గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది.



కోతుల బెడదను నివారించాలి



శాలిగౌరారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సంచరిస్తున్న కోతుల బెడదను నివారించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. గతంలో కోతులను పట్టించిన అధికారులు సమీప అడవుల్లో వదిలివేయడంతో అవి మళ్లీ గ్రామాల్లోకి వస్తున్నాయి. రాబోయే రోజుల్లో మనషుల కంటే ఎక్కువగా కోతులు గ్రామాల్లో ఉంటాయామోనని భయంగా ఉంది. తాము కోతుల వల్ల బజారుల్లో తిరుగలేకపోతున్నాం. ఇళ్లల్లోకి వచ్చి వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. అడ్డుకుంటే ఎగబడి దాడి చేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోతుల బెడద లేకుండా చేయాలి.

\- బండారు మల్లమ్మ, గృహిణి, శాలిగౌరారం

పంట చేలను ధ్వంసం చేస్తున్నాయి



కోతులు గ్రామాల్లోనే కాకుండా పంట పొలాలపై స్వైర విహారం చేస్తున్నాయి. పొట్ట దశలో ఉన్న వరి కంకులను పీకేస్తున్నాయి. పండ్ల కూరగాయల మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. అన్నదాతలను కోతులు ఆగం ఆగం చేస్తున్నాయి. వెంటనే అటవీ శాఖ అధికారులు గ్రామాల్లోని కోతులను పట్టుకెళ్లి అడవుల్లో వదలాలి.

\- దామెర్ల శ్రీనివాస్, రైతు, శాలిగౌరారం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

అరుణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, నార్కట్‌పల్లి



మండలంలో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కత్తుల అరుణ్‌కుమార్ అన్నారు. గ్రామాల్లో సమస్యను పరిష్కరించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

(నార్కట్‌పల్లి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: ఈ వేసవిలో నీటి ఎద్దడిపై పరిస్థితి ఏమిటి?

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ: మండలంలో ఈ వేసవిలో నీటి ఎద్దడి అంతగా ఉండకపోవచ్చు.

ఆంధ్రజ్యోతి: మండలంలో చేతి పంపులు ఎన్ని ఉన్నాయి?

ఏఈ: మండల వ్యాప్తంగా 26 చేతి పంపులు ఉండగా వాటిలో 18 మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగతావి పనిచేయడం లేదు.

ఆంధ్రజ్యోతి: మండల ప్రజల సాధారణ నీటి అవసరాలు ఎలా తీరుతున్నాయి?

ఏఈ: మండల వ్యాప్తంగా 194 పంపు మోటార్లు ఉన్నాయి. వీటిలో 22సింగిల్ ఫేజ్, 172 త్రీ ఫేజ్ మోటార్లు ఉన్నాయి. వీటిలో సింగిల్ ఫేజ్ మోటార్లు 19, త్రీ ఫేజ్ మోటార్లు 160 పనిచేస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: ప్రజలకు ఎన్ని లీటర్ల నీటి అవసరం ఉంటుంది?

ఏఈ: ప్రస్తుత జనాభా మేరకు 5.5 ఎంఎల్‌డీల నీటి అవసరం ఉంటుంది. 3.5 లక్షల నీటి నిల్వ సామర్థ్యం గల 85 ట్యాంకులు ఉన్నాయి. రోజుకు రెండు సార్లు ట్యాంకులను నీటితో నింపుతున్నాం.

ఆంధ్రజ్యోతి: నీటి ఎద్దడి కలిగే అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించారా?

ఏఈ: మండలంలోని నెమ్మాని, నక్కలపల్లి, మాండ్ర గ్రామాల్లో నీటి ఎద్దడి రావచ్చని అంచనా వేస్తున్నాం. ఒకవేళ నీటి ఎద్దడి ఎదురైనా ప్రత్యామ్నాయంగా అద్దె బోర్ల ద్వారా నీటిని అందజేస్తాం.

ఆంధ్రజ్యోతి: మెరుగైన నీటి సరఫరా వ్యవస్థ కోసం నిధులున్నాయా?

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ: మోటార్ మరమ్మతుల కోసం రూ.11 లక్షలు, పైప్‌లైన్ల కోసం రూ.23 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. కొత్తగా 5హెచ్‌పీ మోటార్ల కొనుగోలుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

నైబావిలో వైభవంగా హనుమాన్ యజ్ఞం



ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన హోమంలో పాల్గొన్న భక్తులు

నార్కట్‌పల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ఎం.ఎడవల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల నైబావిలో శనివారం హనుమాన్ యజ్ఞ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. యాజ్ఞీకుడు గుండెపూడి జానకిరామశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన తృతీయ వార్షికోత్సవ పూజోత్సవాల్లో భాగంగా అఖండ దీపారాధన, గణపతి పూజ, పుణ్యావహచనం, స్వామి మూలవిరాట్‌కు ఆకుపూజ, వడమాల, చందనాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించారు. యజ్ఞ క్రతువు వద్ద పలువురు దంపతులు కూర్చున్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ యుగేందర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, ఎర్ర వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, పాశం సత్తిరెడ్డి, నర్సిరెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపాల్, విజయ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డికి బాలసాహిత్య పురస్కారం



అవార్డును తీసుకుంటున్న బుచ్చిరెడ్డి

కనగల్, మార్చి8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన మాదారం గ్రామ హైస్కూల్ ఇంగ్లీష్ టీచర్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డికి 2025 ఏడాదికి గాను ఉత్తమ బాలసాహిత్య పురస్కారం లభించింది. శనివారం ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా పొద్దుటూరులో జరిగిన కునిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కా ర్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివచంద్రారెడ్డి, ప్రముఖ సాహితీవేత్త నరాల రామారెడ్డి జ్ఞాపిక, సన్మాన పత్రం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. అవార్డును అందుకున్న బుచ్చిరెడ్డికి ఎంఈవో పద్మ, తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలి

నల్లగొండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ భగవద్గీతను చదవాలని మునిసిపల్ మాజీ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండ హిందూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాఘవేంద్రకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన హిందూ ఫౌండేషన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, పెద్దలకు భగవద్గీతలోని శ్లోకాలను పఠించి, అందులోని సారాంశాన్ని ఆచరించాలని అన్నారు. అనంతరం కుట్టు శిక్షణలో మొదటి బ్యాచ్ శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలు, బహుమతులను అందజేశారు. రెండో విడత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ రమేష్‌నేత, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా అధ్యక్షురాలు సిరిప్రోలు ఉమాభారతి, నాయకులు చిలుకూరి రాజ్యలక్ష్మి, బొమ్మపాల కవిత, నరేంద్రబాబు, నగేష్, ధనలక్ష్మి, సుమలత, రేణుక, జయ పాల్గొన్నారు.

రామలిగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి



దేవస్థానంలో ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

చండూరురూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): రామలింగేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ నూతన కమిటీ చైర్మన్ రమ్య రామలింగారెడ్డి అన్నారు. చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయ నూతన కమిటీ శనివారం దేవాదాయశాఖ కార్యనిర్వాహణ అధికారి నాగిరెడ్డి, పరిశీలకురాలు సుమతి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భం గా నూతన చైర్మన్ రమ్య రామలింగారెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ మాజీ చైర్మన్లు గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, గజ్జల కృష్ణారెడ్డి, ఆలయ అర్చకులు తిరుపతయ్యశర్మ, శంకరయ్య శర్మ, గిరిప్రసాద్‌శ ర్మ, హరిప్రసాద్‌శర్మ, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కురుపాటి శేఖర్, నాయకులు కురుపాటి సుదర్శన్, కాశమల్ల అనిల్‌కుమార్, కురుపాటి శ్రీకాంత్, గా ర్లపాటి స్వామి, కురుపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల పురోగమనంతోనే దేశాభివృద్ధి



నల్లగొండలో మాట్లాడుతున్న గుమ్మల



నల్లగొండలో కేక్ కట్ చేస్తున్న మహిళలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మహిళల పురోగమనంతోనే సంపూర్ణంగా దేశాభివృద్ధి చెందుతుందని నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నకిరేకల్ పట్టణంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, మున్సిపల్ చైర్ పర్సన్, చెవుగోని రజిత శ్రీనివాస్, వైస్ చైర్మన్ మురారిశెట్టి ఉమారాణి కృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని పలు మండలాల్లో అంతర్జాతీయ మహి ళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో రాణించి న మహిళలను అభినందించి సన్మానించారు.



నకిరేకల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం



నల్లగొండ ఎంఈవో అరుంధతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలకు ఇవ్వాలి



డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకుడు పాలడుగు నాగార్జున

నల్లగొండరూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్లు పేదలకు వెంటనే ఇవ్వాలని సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. సీపీ ఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని దోమలపల్లి గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు రావడం కలగానే మిగిలిందని అన్నారు. ప్రభుత్వాలు మారినా ప్రజల బతుకుల్లో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లు కాలయాపన చేసిందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడిచినా నిర్మించిన ఇళ్లను నేటికీ పంపిణీ చేయడం లేదని అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఈ నెల 24, 25వ తేదీల్లో మండల కేం ద్రాల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టడంతో పాటు 28న కలెక్టర్ కార్యాలయం ఎదుట మహా ధర్నా కార్యక్రమాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నలపరాజు సైదులు, నాయకులు సత్యనారాయణ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

గట్టుప్పల్: ప్రజల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గట్టుప్పల్ మండల వ్యాప్తంగా ఉన్న గ్రామ సమస్యలపై ఈ నెల 10 నుంచి 28వ తేదీ వరకు పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కారం కోసం ఆందోళన కార్య క్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం గట్టుప్పల్ మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, సీపీఎం సీనియర్ నా యకులు చాపల మారయ్య, నాయకులు కర్నాటి సుధాకర్, పరసగోని యాదగిరి, వెంకటేశం, నరసింహ, పెద్దగాని నరసింహ, వల్లూరి శ్రీశైలం పాల్గొన్నారు.

కట్టుకున్న భర్తను కడతేర్చిన భార్య

- *కిరాతకంగా కొట్టి చంపి సాధారణ మరణంగా చిత్రీకరించే కుట్ర*
- *మృతుడు ఖలీల్‌హుస్సేన్ జడ్పీహెచ్‌ఎస్‌లో అటెండర్*

నల్లగొండ క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): భర్తను భార్య కిరాతకంగా కొట్టి హత్య చేసిన ఘటన నల్లగొండ పట్టణంలో చోటు చేసుకుంది. ఛాతిపై బలంగా కొట్టి హత్య చేయడంతోపాటు సాధారణ మృతిగా చిత్రీకరించే కుట్ర చేసింది ఓ భార్య. ఈ విషాదకరమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు, నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని ఉస్మాన్‌పురకు చెందిన ఖలీల్ హుస్సేన్(44) కనగల్ మండలం చర్లగౌరారం జిల్లా పరిషత్ పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఖలీల్ హుస్సేన్ కొంతకాలంగా మానసికంగా ఇబ్బందులు పడుతూ ఇంట్లో అసభ్యంగా ప్రవర్తిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఖలీల్ హుస్సేన్ భార్య అప్సాబేగం ఎలాగైనా అతడిని చంపాలని కుట్ర పన్నింది. అందులో భాగంగా ఫిబ్రవరి 22వ తేదీన ఖలీల్ హుస్సేన్‌ను కట్టెతో ఛాతిపై బలంగా కొట్టింది. ఖలీల్ హుస్సేన్ ఏదో అనారోగ్యంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నాడని భావించిన ఆయన సోదరుడు అహ్మద్ ఏమైందని ప్రశ్నించి ఆసుపత్రికి తీసుకెళ్దామని చెప్పాడు. తన దగ్గర డబ్బులు లేవని అప్సాబేగం చెప్పడంతో పాటు ఖలీల్ హుస్సేన్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు వెనకడుగు వేసింది. మృతుడి సోదరుడి బలవంతం మీద ఖలీల్‌ను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యం పొందిన ఖలీల్ ఫిబ్రవరి 24వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె ఇంటర్మీడియట్, చిన్న కుమార్తె 8వ తరగతి, కుమారుడు 4వ తరగతి చదువుతున్నారు. మృతుడు ఖలీల్ హుస్సేన్ తల్లి మహ్మద్ బేగం ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని సీఐ తెలిపారు.

పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా విచారణ

ఖలీల్ హుస్సేన్ గుండెపోటుతో మృతి చెందాడని భార్య అప్సాబేగం బంధువులను సైతం నమ్మించే ప్రయత్నం చేసింది. మృతుడు ఖలీల్ ఒంటిపై గాయాలు ఉండటంతో అనుమానం వచ్చిన మృతుని కుటుంబ సభ్యులు స్థానిక వన్‌టౌన్ పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. శుక్రవారం వచ్చిన పోస్టుమార్టం రిపోర్టులో గుండెపోటు, సాధారణ మృతి కాదని ఖలీల్‌ను హత్య చేసినట్లు పోస్టుమార్టం ఎగ్జామినేషన్ (పీఎంఐ) రిపోర్టు రావడంతో ఆ నివేదిక ఆధారంగా మృతుని భార్య అప్సాబేగంను అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ పోలీసులు విచారించారు. విచారణలో తానే తన భర్త ఖలీల్‌ను హత్య చేసినట్లు విచారణలో అప్సాబేగం అంగీకరించినట్లు సీఐ తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



ఎఫ్‌డీ డాక్యుమెంట్లను అందిస్తున్న స్నేహితులు

నల్లగొండరూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కలిసి చదువుకున్న స్నేహితుడు మృతి చెందగా, ఆ కుటుంబానికి మిత్రులు బాసటగా నిలిచారు. 2005 - 2006 కాలంలో నల్లగొండలోని డైట్ కాలేజీలో తమతో పాటు టీచర్ ట్రైనింగ్ కోర్సు చేసిన నల్లగొండ పట్టణానికి చెందిన నర్సింగ్ ప్రభాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబానికి చేదోడుగా నిలవాలని, నిర్ణయించుకున్నారు. డైట్ మిత్రులు కలిసి నర్సింగ్ ప్రభాకర్ కుమార్తె మేఘన పేరు మీద రూ.1,26,611 లను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. శనివారం శివాజీనగర్ లోని ఎస్‌బీఐలో తీసిన ఎఫ్‌డీకి సంబంధించిన డాక్యుమెంట్‌ను మేఘనకు అంతజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు సురిగి సైదు లు, శ్రీనివాస్ నాయుడు, వజ్జ వెంకన్న, అర్వ అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐగా ఎర్ర సైదులు



ఎర్ర సైదులు

నల్లగొండ క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నల్లగొండ టూటౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎర్ర సైదులు శనివారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ సైదులు బదిలీపై నల్లగొండ టూటౌన్‌కు ఎస్‌ఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సైదులు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, అక్రమదందాలకు పాల్పడినా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది కూడా స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను విని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఇప్పటి వరకు నల్లగొండ టూటౌన్‌లో ఎస్‌ఐగా పనిచేసిన నాగరాజు జిల్లా ఎస్పీ కార్యాలయంలోని వీఆర్‌కు బదిలీ అయ్యారు.

తల్లిదండ్రులపై దైవభక్తి కలిగి ఉండాలి

నల్లగొండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులపై పిల్లలకు దైవభక్తి కలిగి ఉండాలని ప్రముఖ డాక్టర్ మాతృ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో శనివారం ఎంవీఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెన్త్‌క్లాస్ విద్యార్థుల పాదపూజ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చదువుతో పాటు సంస్కారం కూడా నేర్చుకోవాలని, ప్రతి ఒక్కరూ వ్యసనాలకు బానిస కాకుండా దైవభక్తి, తల్లిదండ్రులపై ప్రేమ, గురువులపై అభిమానం కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులపై పిల్లలకు గౌరవమర్యాదలు లేకుండా పోతున్న తరణంలో ఇలాంటి పాదపూజను నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. అనంతరం బ్రహ్మశ్రీ కుమార్‌పండిట్ శిష్యబృందం విద్యార్థులతో పాదపూజ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ పీపీ వెంకటరమణారావు, ఎంవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కొలనుపాక గీత రవికుమార్, ప్రిన్సిపాల్ రఘువందన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.112	175	200
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 21.6

కల్యాణం కమనీయం


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంలో లక్ష్మీనారసింహుల బ్రహ్మోత్సవ తిరుకల్యాణం శనివారం వేద మంత్రోచ్ఛారణ.. భక్తుల గోవింద నామస్మరణల మధ్య శాస్త్రోక్తంగా జరిగింది. భక్తప రాయణుడు, అవతార పురుషుడు నారసింహుడితో.. సిరి సంపదలకు నెలవైన సముద్రరాజ తనయ లక్ష్మీదేవితో పాంచరాత్రాగమ రీతిలో శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు.

• 7లో..

• ఆంధ్రజ్యోతి, యాదాద్రి


స్వామివారి కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

నామినేటెడ్‌పై చిగురిస్తున్న ఆశలు



రాష్ట్రంలో అతి త్వరలో నామినేటెడ్ పదవులన్నింటినీ భర్తీ చేస్తామని అధిష్ఠానం నుంచి సంకేతాలు రావడంతో ఆశావహుల ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్ నియమితులయ్యాక జరిగిన వరుస సమీక్షల నేపథ్యంలో ఈ మేరకు నేతలకు భరోసా లభించింది. క్యాబినెట్ విస్తరణ, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల నియామకాలు, పెండింగ్‌లో ఉన్న రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల పదవులు, జిల్లాల్లో ముఖ్యమైన నామినేటెడ్ పదవులన్నింటినీ ఈ నెలాఖరులోగా భర్తీ చేసేందుకు రంగం సిద్ధమైంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

- క్యాబినెట్ విస్తరణ, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల్లో ఛాన్స్!
- కీలక నేతలకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్లు పక్కా అనే సంకేతాలు
- పదవుల కోసం క్యూలో ఉన్న పలువురు కీలక నాయకులు
- సీఎం, మంత్రుల ఢిల్లీ టూర్ నేపథ్యంలో ఆశావహుల ముమ్మర ప్రయత్నాలు
- గాడ్‌ఫాదర్లపై ఒత్తిడి పెంచిన ఆశావహులు

ఉమ్మడి జిల్లాలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సీనియర్ల వివరాలను అధిష్ఠానం తెప్పించుకుంటుండడంతో ఆశావహుల్లో ఒక్కసారిగా సందడి మొదలైంది. క్యాబినెట్ విస్తరణ, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారుతో పాటు ముఖ్యమైన నియామకాల కోసం ఏఐసీసీ ఆమోద ముద్ర తీసుకునేందుకే సీఎం సహా ముఖ్యనేతలు ఆదివారం ఢిల్లీకి వెళ్తారని తెలియడంతో ఆశావహులు చివరి ప్రయత్నాలను వేగవంతం చేశారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులతో పాటు జిల్లా స్థాయిల్లో ఉండే గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, మహిళా ఆర్గనైజర్ పదవులు, దేవాలయాల కమిటీల చైర్మన్ పదవులు, నుడా చైర్మన్ పదవి, మార్కెట్ కమిటీ చైర్మన్ల వంటి పదవులను ఆశించే నాయకులంతా వారికి పదవులు ఇప్పించాలని మంత్రులు, ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు.

ఉమ్మడి జిల్లాకు స్థానం దక్కుతుందనే ఆశాభావం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రివర్గంలో జిల్లా నుంచి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కీలకమైన మంత్రి పదవులు దక్కాయి. అయితే బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో, ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి క్యాబినెట్ విస్తరణలో అవకాశం కల్పిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చిందని, విస్తరణ చేపడితే ఆయనకు మంత్రి పదవి దక్కుతుందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చసాగుతోంది. మరోవైపున దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్‌కు సైతం విస్తరణలో మంత్రి పదవి లేదా, డిప్యూటీ స్పీకర్ పదవి వస్తుందనే ప్రచారం సాగుతోంది. తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2014, 2018 ఎన్నికల్లో పోటీచేసి ఓటమిపాలవడంతో పాటు, గత ఎన్నికల్లో పోటీ చాన్స్ కోల్పోయినా పార్టీలోనే కొనసాగుతున్న డాక్టర్ అద్దంకి దయాకర్ పేరు రాజ్యసభకు కూడా పరిశీలించినా సమీకరణాల్లో కుదరలేదని, ఎమ్మెల్సీగా ఆయనకు అవకాశం తథ్యమని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, డాక్టర్ కె.నగేశ్ కూడా పార్టీలో క్రియాశీలకంగా ఉండడంతో వీరికి ఎలాంటి పదవులిస్తారనే ఆసక్తి పార్టీలో నెలకొంది. నల్లగొండ డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న కేతావత్ శంకర్‌నాయక్‌కు కూడా ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని పార్టీ ముఖ్యనేతల నుంచి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన నేపథ్యంలో తనకు పదవి ఖాయమనే విశ్వాసంలో ఆయన ఉన్నారు. వీరితో పాటుగా బీసీ కోటాలో మునుగోడు నియోజకవర్గానికి చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్‌నేత కూడా తనకు పార్టీ పెద్దల ఆశీర్వాదం ఉందని, ఎమ్మెల్సీ లేక కార్పొరేషన్ చైర్మన్ పదవి ఖాయమనే...

- మిగతా 6వ పేజీలో...


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో మంత్రి వెంకట్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యేలు

వేసవిలో ఇబ్బందులు రాకుండా చూడాలి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేసవిలో తాగు, సాగునీరు, విద్యుత్‌కు ఇబ్బందులు రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పని చేయాలని వ్యవసాయశాఖ మంత్రి, నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కలెక్టర్‌లో నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా తాగునీరు, ఇరిగేషన్, విద్యుత్ అంశాలపై సమీక్షలో ఆయన మాట్లాడారు.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- వేసవిలో అప్రమత్తంగా ఉండాలి : మండలి చైర్మన్ గుత్తా
- ప్రజలకు పూర్తి సేవలు అందించాలి: మంత్రి కోమటిరెడ్డి
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలు అంశాలపై సమీక్ష

వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా, అలాగే పంటలు ఎండిపోకుండా, విద్యుత్ సరఫరా నిరంతరం కొనసాగేలా సంబంధిత శాఖల సీనియర్ అధికారులు మొదలు కిందిస్థాయి అధికారుల వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. మిషన్ భగీరథ అధికారులు ప్రజలకు తాగునీటి ఇబ్బంది ఏర్పడకుండా ఈఎన్‌సీ స్థాయిలో పూర్తి దృష్టి సారించాలన్నారు. తక్షణ తాగునీటి సమస్యలను తీర్చేందుకు అవసరమైతే కలెక్టర్ల వద్ద నిధులు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి వెసులుబాటు కల్పిస్తామన్నారు. అలాగే ముఖ్యమంత్రితో చర్చించి శాసనసభ్యులకు ఎస్‌డీఎఫ్ కింద నిధులు ఇచ్చేలా చర్చిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఒక్క ఎకరం పొలం కూడా ఎండిపోకుండా ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందించి పంటలు కాపాడాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు కాల్వలపై పర్యటించాలని, అలాగే వ్యవసాయ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తిరిగి ఎప్పటికప్పుడు నీటి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టుల కింద ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని సరైన విధంగా పర్యవేక్షణ చేసి అందరికీ వచ్చేలా చూడాలన్నారు. విద్యుత్ అధికారులు విద్యుత్ సమస్యలు రాకుండా క్షేత్రస్థాయిలో తిరిగి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మూడు సమస్యలపై దృష్టి పెట్టి పనిచేయాలని, అదేవిధంగా ప్రజాప్రతినిధులు సైతం మండల స్థాయి అధికారులను వెంట తీసుకెళ్లి గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేసవిలో ఈ మూడు అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు మనసు పెట్టి పనిచేసి సమన్వయంతో కృషి చేయాలన్నారు.

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో 1,775 గ్రామాలు ఉన్నాయని, ప్రతీ రోజు 140 ఎంఎల్‌డీ తాగునీరు అవసరం ఉందన్నారు. విలీన గ్రామాల్లో తప్ప ఎక్కడా సమస్య లేదని, తాగునీటి బోర్ల చిన్న చిన్న మరమ్మతులకు, అలాగే పైపులైన్ల మరమ్మతులకు...

- మిగతా 7వ పేజీలో...

ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



వేసవిలో కష్టమైనప్పటికీ అధికారులు ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కలెక్టర్లు తాగునీటిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, అందుబాటులో ఉన్న నిధులను ప్రతి గ్రామానికి రూ.10వేల నుంచి రూ.15వేల చొప్పున తక్షణమే కేటాయించి ఎక్కడైనా తాగునీటి సమస్య ఉత్పన్నమవుతే వాటిని వినియోగించాలన్నారు. శాసనసభ్యులు సైతం వారి ఎస్‌డీఎఫ్ నిధులను తాగునీటి కోసం కేటాయించాలని కోరారు.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ, తక్షణం తాగునీటి అవసరాలకు కలెక్టర్ల వద్ద కనీసం రూ.5కోట్లు, నల్లగొండ జిల్లా విస్తీర్ణం పెద్దగా ఉన్నందున రూ.15కోట్ల నిధులు ఉంచాలని, ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎక్కడ తాగునీటి సమస్య ఉంటే అధికారులు అక్కడికి వెళ్లి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సాగునీటికి సంబంధించి మేజర్ ప్రాజెక్టులు, కాల్వలపై కచ్చితంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఏఎంఆర్ ప్రాజెక్టు కింద కెనాల్ విస్తరణ, లైనింగ్ చేపడితే సమృద్ధిగా నీరు అందించవచ్చని, ఉదయ సముద్రం మేజర్ కెనాల్ పూర్తి చేసి చెరువులకు నీరు అందిస్తే సాగునీటి సమస్య రాదన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కాల్వలపై వందలాది మోటర్లు ఏర్పాటు చేసుకున్నారని, అలాగే అవసరం లేకున్నా నిరంతరం పవర్ బోర్లు నడుస్తున్నాయని, దీంతో విద్యుత్‌తో పాటు నీరు వృథా అవుతోందని, దీన్ని నియంత్రించే విషయాన్ని అధికారులు ఆలోచించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద కాల్వల చిన్న చిన్న పనులు చేపట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విద్యుత్ సమస్య లేదని, అయినా ఆ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

చారిత్రాత్మక సంపదకు నెలవు నందికొండ


నాగార్జునకొండపై ఉన్న మ్యూజియం

• 6లో..

ఇద్దరు సీఐలు, ఎస్‌ఐపై బదిలీవేటు!

• మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐగా మోతీరాం

• 6లో..

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మహిళలతో సెల్ఫీ దిగుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో జిల్లా, పట్టణ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 150 సీట్లలో 50మంది మహిళలు ఎమ్మెల్యేగా ఉంటారన్నారు. మహిళా బిల్లు కూడా త్వరలో అమలవుతుందని పేర్కొన్నారు. త్వరలో కొత్తగా 1,000 ఆర్టీసీ బస్సులను మహిళా సంఘాలకు అప్పగిస్తామన్నారు. జిల్లాలోని మహిళా సంఘాలకు 50 బస్సులను కేటాయిస్తామన్నారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగాని మాధవి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500కు సిలిండర్ అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డుపల్లి లక్ష్మి, గాజుల సుకన్య, దుబ్బ రూప, భాగ్య, నాగమణిరెడ్డి, లలిత, సదాలక్ష్మి, ధనలక్ష్మి, మాదవి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటిని మంత్రులు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిని సన్మానించారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

కామినేని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బాబాసాహెబ్


ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

రామగిరి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కామినేని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ బాబాసాహెబ్, గైనకాలజీ విభాగం హెచ్‌వోడీ సునిత సుధీర్ అన్నారు. స్థానిక సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో కామినేని సొసైటీ డైరెక్టర్ డాక్టర్ లూథర్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన ఆరోగ్య సదస్సులో మాట్లాడారు. మహిళలు గర్భాశయ క్యాన్సర్‌కు గురికాకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. తొమ్మిదేళ్ల వయసు నుంచి మూడు దోసులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ కల్నల్, పీవీ.రామ్మోహన్, ఉమెన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పవిత్ర, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, వైద్యులు సునిత, రామారావు, రీటా, మారుతిశర్మ, బాలరాజు, శంకర్, వై.అశోక్ దేవ్, మౌనిక, దేవకుమారి, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

జిల్లా న్యాయాధికారి ఎం.నాగరాజు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి నాగరాజు

నల్లగొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.నాగరాజు అన్నారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాలతో జిల్లాలోని అన్ని కోర్టుల్లో శనివారం లోక్‌అదాలత్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో 40సివిల్ కేసులు, 5,807 క్రిమినల్ కేసులు, 95 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 3 బ్యాంక్, 29సైబర్‌క్రైం, 100 ట్రాన్స్‌కో కేసులతో పాటు 12,879 ట్రాఫిక్ చలానా కేసులు, మొత్తంగా 18,953 పెండింగ్ కేసులను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం మహిళలు గళమెత్తాలి

నకిరేకల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం మహిళలు గళమెత్తాలని నకిరేకల్ సీనియర్ సివిల్ జడ్జి మంజుల సురియార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం సామానత్వంతో కూడిన మహిళా సాధికారత అనే అంశంపై నిర్వహించిన చైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. దేశంలో స్త్రీలకు సమాన అవకాశాలు లభించడంలేదన్నారు. అందుకు మహిళలు గళమెత్తాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ గోనె శ్రీలత, సైదమ్మ, యశోద, జ్యోతి, దేవయాని, యాట మధుసూదన్‌రెడ్డి, పి.నర్సింహమూర్తి, కె.శ్రీనివాస్, ఆర్.రాకేష్‌కుమార్, కె.రవికుమార్, జయసాగర్, తదితరులు పాల్గొన్నారు.


హాలియాలో వజ్రతేజ రైస్ క్లస్టర్‌లో మహిళలను సన్మానిస్తున్న మిల్లర్లు

సృష్టికి మూలం స్త్రీమూర్తి

● ఆకాశంలో సగం.. అవని అంతా ఆమె ● ఘనంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా కొనియాడిన వక్తలు ● పలువురు మహిళలకు సన్మానం

సృష్టికి మూలం స్త్రీమూర్తి అని పలువురు వక్తలు కొనియాడారు. ఆకాశంలో సగం.. అవని అంతా ఆమే అంటూ సమాజ పురోగతిలో మహిళ పాత్రను కొనియాడారు. ఉదయం లేచింది మొదలు.. రాత్రి పొద్దుపోయే వరకు ఇంటిల్లిపాదిని కంటికి రెప్పలా కాపాడుకునే ఆమె ఓపికను ప్రశంసించారు. జిల్లావ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా మండలాల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించి, అభినందించారు.

మిర్యాలగూడ లీగల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నేటి మహిళలు స్వయం సాధికారత దిశగా ముందుకు వెళ్తున్నారని, సమాజ పురోగతిలో వారి పాత్ర ఎంతో కీలకమని మిర్యాలగూడ 5వ అదనపు జిల్లా జడ్జి జి.వేణు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వేణు మాట్లాడుతూ నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళా న్యాయమూర్తులు సుమబాల, శ్రీదేవిలను జడ్జి శాలువాలతో ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా న్యాయవాదులు జెయిని సుష్మిత, గంగాభవాని, శ్రీదేవి, ఆస్మా, స్వరాజ్యం, స్వాతి, పద్మలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సుజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రామకృష్ణారెడ్డి, ఇబ్రహీం పాల్గొన్నారు.

మహిళలు హక్కులపై అవగాహన పెంచుకోవాలి

దేవరకొండ: మహిళలు చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవాలని దేవరకొండ మున్సిఫ్‌కోర్టు సివిల్ జడ్జీ కె.అనిత అన్నారు. దేవరకొండ ఆర్టీసీ డిపోలో జరిగిన మహిళ దినోత్సవంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ఆంజనేయులు, న్యాయవాదులు ఆర్ఎస్.రావు, దీప్లాల్ పాల్గొన్నారు.

● దేవరకొండలో గ్రామ్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు డాక్టర్ రుక్మిణీరావు, సుమలత, ఎంఎస్.కాంత, శాంతి పాల్గొన్నారు. అదే విధంగా బీసీ సంక్షేమసంఘం, స్పోర్ట్స్ అసోసియేషన్, రిటైర్డ్ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ వయోవృద్ధుల ఆశ్రమ కేంద్ర నిర్వాహకురాలు మారెడ్డి సంధ్యరెడ్డి, శేరిపల్లి జయలక్ష్మీ, కొండ లలిత బాయి, రేణుక, వనం చంద్రకళ, పగిడిమర్రి జానకిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ఉద్యోగ సంఘం భవనంలో రిటైర్డ్ ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.నర్సింహ, అంకం చంద్రమౌళిలు మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఎన్వీటీ, చిత్రియాల పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి మహిళలను సన్మానించారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు పొదుపు సంఘాల సభ్యులు తరలివెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మహిళలకు శుభాకాంక్షలు తెలిపి బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.


మిర్యాలగూడలో మహిళలను సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

హాలియా: ఓవైపు కుటుంబ బాధ్యతలు మోస్తూనే, మరోవైపు విభిన్న రంగాల్లో మహిళలు రాణించడం అభినందనీయమని హాలియా మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా మిల్లర్స్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు యాదగిరి, ఎస్.ఐ సతీష్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్కెట్ యార్డులో, వజ్రతేజ రైస్ ఇండస్ట్రీలో, పోలీస్ స్టేషన్, సీఐటీయు, నాయుడుపాలెం గ్రామంలో మహిళలను ఘనంగా సన్మానించారు. మహిళలు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమ, చెన్ను సౌజన్యరెడ్డి, నవ్య, భవాని, వెన్నెల, విమల, స్వర్ణలత, ఆఫ్రిన్, హరిక తదితరులను సన్మానించగా కార్యక్రమంలో యడవల్లి నరేందర్‌రెడ్డి, మండల విద్యాధికారులు కృష్ణమూర్తి, తరి రాము,శ్రీనివాస్ సీఐటీయు అవుతా సైదయ్య, మందా సైదులురావుగౌతమ్, వజ్రతేజ డైరెక్టర్స్ చిట్టిపోలు వెంకటేశ్వర్లు, కుక్కడపు రమేష్, కరుణాసాగర్, హేమంత్, హాలియా, నిడమనూరు రైస్ మిల్లర్స్ జనరల్ సెక్రటరీ పేలపూడి బాలకృష్ణ, మలిగిరెడ్డి రామాంజిరెడ్డి, కోట నాగిరెడ్డి, సుదర్శన్, గురుప్రసాద్, చంద్రశేఖర్, శేఖర్, మహేష్ పాల్గొన్నారు. హాలియాలో పలువురు మహిళలను సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సన్మానించారు.

చింతపల్లి: మండల కేంద్రంలోని షిర్డిసాయిబాబ ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మంచికంటి ధనంజయ్య, కొమిరిశెట్టి వెంకటయ్య, పూరె కృష్ణయ్య, పుల్లా రెడ్డి పాల్గొన్నారు. మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్) పీహెచ్‌సీలో సిబ్బంది ఘనంగా నిర్వహించారు.

అడవిదేవులపల్లి: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దుర్గయ్య శ్రీను, అంగన్‌వాడి టీచర్లు సుశీల, మణెమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.

మిర్యాలగూడ: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని డాక్టర్ ముప్పా జీవనజ్యోతి అన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా స్థానిక మీనా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక, హెచ్‌పీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు డా. ముప్పారామారావు, మీనా కళాశాల చైర్మన్ మహ్మద్‌అలీ, కొండల్‌రెడ్డి, కందుకూరి సుదర్శన్ పాల్గొన్నారు. వాసవీ భవన్‌లో రెనోవా సెంచరీ హస్పిటల్స్, రోటరీ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ నిర్వాహకులు డా.లలిత, రోటరీ క్లబ్ అధ్యక్షులు రేపాల అంతయ్య, నరేందర్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్ పాల్గొన్నారు. మహిళా సమాఖ్య, సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దాసర్ల దుర్గమ్మ, బంటు వెంకటేశ్వర్లు, బిల్ల కనకయ్య, మహిళా నాయకులు గుమ్మకొండ అంజమ్మ, కిష్టమ్మ పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి : శంకర్‌నాయక్

మిర్యాలగూడ: మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక లక్ష్మీ కళ్యాణమండపంలో మహిళా ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. ఉద్యోగినులుగా రాణిస్తున్న బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కెమిస్ట్రీ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ కేతావత్ ప్రమీల ఇతర ఉద్యోగులు, ఉపాధ్యాయినులు లలితాబాయి, సరోజ, రమ్యశ్రీ, బుజ్జి నీలా, రంజిత, సుగుణలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్, కిషన్‌నాయక్, మక్లానాయక్, శంకర్‌నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: సమాజంలో మహిళల పాత్ర కీలకమని ఏపీఎం బాషపాక చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి మాట్లాడారు.

కొండమల్లేపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామ్మూర్తి ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుళ్లు రాణి, నాగసంధ్య, శిల్పలను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్ఐ సీతయనాయక్ పాల్గొన్నారు. ఎస్‌కెఎస్ స్కూల్‌లో అనితకుమారి, ఉపాధ్యాయులు ఝాన్సీ రాణి, ప్రసన్న, జ్యోతి, రేణుక పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాలియా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి పెద్దవూర, హాలియా, తిరుమలగిరి(సాగర్) మండలాల్లో ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయినులను సన్మానించారు. కార్యక్రమంలో మంగాదేవి, పూరె వెంకన్న, గౌస్, ఈదయ్య, ఎంతఃపోలు తరి రాములు, శ్రీనివాస్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

శ్మశాన వాటికల్లో సదుపాయాలేవీ?

● అంతిమ సంస్కారాలకు వచ్చే ప్రజలకు తప్పని ఇబ్బందులు


వసతుల్లేని దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామంలోని శ్మశానవాటిక

దామరచర్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించాలంటే పలు గ్రామాల్లో ప్రజలు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితులు గతంలో ఉండేవి. స్థలాలు, సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడేవారు. కానీ గత ప్రభుత్వం అన్ని గ్రామపంచాయతీల్లో శ్మశానవాటికలకు నిధులు కేటాయించి వాటి నిర్మాణాలకు చర్యలు తీసుకుంది. కానీ అవి ఎక్కువ గ్రామాల్లో అసంపూర్తిగానే మిగిలిపోయాయి. దామరచర్ల మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో గత ఐదేళ్ల క్రితం శ్మశానవాటికను ఊరి చివరిలో నిర్మించారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు దహన సంస్కారాలు నిర్వహించే షెడ్లు, కర్మకాండలు నిర్వహించే గదిని మాత్రమే నిర్మించి వదిలేశారు. ప్రధానంగా దహన సంస్కారాలకు వచ్చే వారు స్నానాలు చేసేందుకు నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాలకు రెండు కిలోమీటర్ల దూరంలో శ్మశానవాటికలు ఉండడంతో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోతున్నారు. శ్మశానవాటికల చుట్టూ రక్షణ గోడలు, గేట్లు నిర్మించలేదు. అధికారులు తక్షణమే స్పందించి రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వసతులు మెరుగు పరచాలి



గ్రామాల్లో శ్మశానవాటికలు నిర్మించి వసతులను కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నీటి సౌకర్యం లేకపోవడంతో రానున్న వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. శ్మశానవాటికల చుట్టూ ప్రహరీ, నీటి, విద్యుత్ సౌకర్యం కల్పించాలి.

మాలోతు వినోద్‌నాయక్, నర్సాపురం

యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలి



మాడ్గులపల్లిలో డీవైఎఫ్ఐ సభ్యత్వ నమోదును అందచేస్తున్న పఠాని శ్రీను

మాడ్గులపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో యువతకు ఇచ్చిన యూత్ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు పఠాని శ్రీను అన్నారు. శనివారం మండలకేంద్రంలో డీవైఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం యూత్ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయకుండా మోసం చేస్తుందన్నారు. నిరుద్యోగులకు రూ.4వేల భృతి అందించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పుల్లెంల శ్రీకర్, ఎలిజాల రమేష్, ప్రశాంత్, సతీష్, గురుస్వామి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ల ద్వారా సత్వర న్యాయం

● 5వ అదనపు జిల్లా జడ్జి జి.వేణు



లోక్‌అదాలత్ అవార్డును అందజేస్తున్న జడ్జి వేణు

మిర్యాలగూడ లీగల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని 5వ అదనపు జిల్లా జడ్జి జి.వేణు అన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌ను న్యాయమూర్తులు శనివారం సుజయ్, సుమబాల, శ్రీదేవిలతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి వేణు మాట్లాడుతూ వాహన ప్రమాద కేసుల్లో లోక్‌అదాలత్‌ల ద్వారా నష్ట పరిహారం సత్వరమే అందిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి కుడి చేయి పోగొట్టుకున్న కొండ్రపోల్ గ్రామానికి చెందిన ధీరావత్ వనితకు ఈ సందర్భంగా రూ.11లక్షల నష్ట పరిహారాన్ని ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా లోక్ అదాలత్ అవార్డును జడ్జి ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డి.సుజయ్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సుమబాల, మెజిస్ట్రేట్ శ్రీదేవి, ఏజీపీ గోదల వెంకట్‌రెడ్డి, స్పెషల్ ఏజీపీ శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కక్షిదారులకు ఏజీపీవెంకట్‌రెడ్డి పులిహోర ప్యాకెట్లను అందజేశారు.

ప్రజా సమస్యలపై పోరుబాట

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో శనివారం మండలకేంద్రంలో పోరుబాట నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ మాట్లాడుతూ పీఏపల్లి మండలకేంద్రంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్వేలో తమ దృష్టికి వచ్చిందన్నారు. దాదాపు 15 ఏళ్లనుంచి రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు గత ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఒకే ఇంట్లో మూడు కుటుంబాలు జీవనం చేస్తున్నట్లు తేలిందన్నారు. సంవత్సరం నుంచి దరఖాస్తులు పెట్టుకున్నా, ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కావలి కృష్ణయ్య, ధర్మాపురం దేవయ్య, సత్యనారాయణ, చందునాయక్ పాల్గొన్నారు.

సన్మానం


నిడమనూరు మండలం ముప్పారంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధి మహిళా కూలీలను సన్మానించి, మిఠాయిలు తినిపిస్తున్న ఈజీఎస్ సిబ్బంది

● నిడమనూరు

డీ-40 కాల్వ ద్వారా సాగునీరు అందించాలి

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి


మలపరాజుగూడెంలో ఎండిపోతున్న వరిపొలాలను పరిశీలిస్తున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మాడ్గులపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): డీ-40 కాల్వ ద్వారా సాగునీటిని విడుదలచేసి చివరి ఆయకట్టు వరకు నీటిని అందించి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఇందుగుల గ్రామపరిధిలోని మలపరాజుగూడెంలో ఎండిపోయిన వరి పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు ఎకరానికి రూ.30వేలు ఖర్చు చేసి సాగు చేస్తే పొట్ట దశలో ఉన్న వరి పొలాలకు నీరు అందకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. డీ-40 కాల్వ ద్వారా నీరందక మండల పరిధిలోని కొత్తగూడెం, గుర్రప్పగూడెం, ఇందుగుల, మలపరాజుగూడెం, సీత్యాతండా తదితర గ్రామాల్లో పొలాలు ఎండిపోతున్నాయని వెంటనే ప్రభుత్వం డీ-40 కాల్వ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరందించి ఎండిపోతున్న వరిపొలాలను కాపాడాలని డిమాండ్‌చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 28న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో ప్రజలు, రైతులు, కార్మికులు, యువకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, పుల్లెంల శ్రీకర్, పఠాని శ్రీను, బొమ్మకంటి అంజయ్య, జూకూరి నాగయ్య, నగిరె కృష్ణయ్య, బొంగర్ల వెంకటయ్య, తంగెళ్ల నాగమణి పాల్గొన్నారు.

డ్రైనేజీ గుంతల చుట్టూ రక్షణ చర్యలు



రక్షణ చర్యలు చేపట్టిన అనంతరం, పక్కన అంతకుముందు ప్రమాదకరంగా గుంత

దేవరకొండ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మున్సిపాలిటీలో డ్రైనేజీ గుంతల చుట్టూ రక్షణ చర్యలు చేపట్టారు. 'ప్రమాదకరంగా డ్రైనేజీ గుంతలు, ఆదమరిస్తే అంతే సంగతులు' అనే కథనం ఈ నెల 1న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి నేషనల్ హైవే, దేవరకొండ మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన కూడలి, తహసీల్దార్ కార్యాలయం, రిటైర్డ్ ఉద్యోగ సంఘం భవనానికి వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ గుంత చుట్టూ డ్రమ్ములు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గుంతలను పూడ్చి రక్షణ చర్యలు చేపడుతామని మున్సిపల్ కమిషనర్ సుదర్శన్, నేషనల్ హైవే ఏఈ కర్ణాకర్ శనివారం తెలిపారు.

డ్రైనేజీ గుంత చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవడంతో ప్రమాదాలు తప్పాయని పేర్కొన్నారు. ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ గుంత సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాసంఘాలను బలోపేతం చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

డిండి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రజాసంఘాలను బలోపేతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటరమణ అన్నారు. శనివారం తవక్లాపూర్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను సీపీఐ కైవసం చేసుకోవాలని కోరారు. ఆ దిశగా కార్యకర్తలు ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈసమావేశంలో ఎండి. మైనొద్దిన్, నూనె వెంకటేశ్వర్లు, చక్రి, ఎనమళ్ల నవీన్ పాల్గొన్నారు.

చేపలవేటకు వెళ్లి ఒకరి మృతి

దేవరకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి కుంటలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం జేత్యతండాలో శనివారం జరిగింది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన రమావత్ బిచ్చు(39) కూలీ పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. శనివారం చేపలకోసమని గ్రామశివారులోని కుంటలోకి వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. గమనించిన స్థానికులు మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బిచ్చు భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బిచ్చు మృతిపై ఫిర్యాదు అందలేదని దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి..



నాగార్జునసాగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ కమలానెహ్రూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సీఐ బీసన్న తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం సాగర్ హిల్ కాలనీలో రోడ్డుపై మద్యం మత్తులో స్పృహ లేకుండా పడి ఉన్న వ్యక్తిని పోలీసులు చికిత్స నిమిత్తం స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడని తెలిపారు. మృతుని వివరాలు తెలియరాలేదని ఎవరైనా గుర్తిస్తే సెల్ నంబర్ 8712670153 లేదా స్టేషన్ నెంబరు 8712674749లకు సంప్రదించాలని కోరారు.